https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 7 | సంచిక 226 | కర్నూలు | ఆదివారం, 31 డిసెంబర్ 2023 | పేజీలు 11 | వెల రూ. 5.00

Published from Kurnool | Vijayawada | Ananthapuramu | Kadapa | Chittoor | Nellore | Prakasham | East Godavari | West Godavari | Hyderabad



# అయోధ్య కోసం 550 ఏళ్లు వేచిచూశాం





- 22న ఈ కల సాకారం కాబోతోంది
- ప్రారంభం రోజు ఎవరూ అయోధ్యకు రావద్దు
- 23నుంచి ఎప్పుడైనా సంద్శించవచ్చు
- అయోధ్యను ఆధ్యాత్మిక నగరిగా తీర్చిదిద్దుతాం
- 22న దేశవ్యాప్తంగా దీపావళి జరుపుకోవాలి
- వాల్మీకి పేరుతో విమానాశ్రయం గర్వంగా ఉంది
- అయోధ్య పర్యటనలో ప్రధాని మోడీ వెల్లడి

అయోధ్య, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :

యావత్ ప్రపంచం అయోధ్యలో భవ్య రామాలయ ప్రారంభోత్సవం రోజు కోసం ఎదురుచూస్తోందని, జనవరి 22న జరిగి కార్యక్రమంలో పాల్గొనాలని అందరికీ ఉంటుందని, అయితే అది సాధ్యం కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కొందరినే ఈ మహోజ్వల ఘట్టానికి ఆహ్వానించినందున ఆరోజు రావాలని అనుకోవద్దని ప్రజలను కోరారు. లాంఛనంగా రామాలయం ప్రారంభం కాగానే ఎవరికి వారు తమ వీలును బట్టి వచ్చి భగవాన్ రామ్‌ను దర్శించుకోవచ్చని సూచించారు. అయోధ్యలో ప్రధాని పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన వేదిక నుంచి 15,700 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభించారు. పలు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనవరి 22వ తేదీ చారిత్రక క్షణాల కోసం ప్రపంచం మొత్తం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోందని, సహజంగానే అయోధ్య వాసుల్లో మరింత ఎక్కువ ఉత్సాహం తొంగిచూస్తోందని అన్నారు. ఈ పుణ్యభూమి లోని అణువణువునూ తాను ఆరాధిస్తుం టాననిఅందరిలాగే తాను కూడా..

2



# అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయండి

- గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోండి
- సీఎం జగన్‌కు లోకేశ్ లేఖ

అమరావతి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :




తక్షణమే అగ్రిగోల్డ్ బాధితులకు సొమ్ములు చెల్లించి న్యాయం చేయాలని కోరుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ లేఖ రాశారు. మీరు ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు అగ్రిగోల్డ్ విషయంలో మా టీడీపీ ప్రభుత్వంపైనా, నాపైనా చేసిన ఆరోపణలు, చిమ్మిన విషం మీరు మరిచిపోయుంటారు. కానీ మేము మరిచిపోలేదు. నాటి సీఎం వైఎస్ గారి పాలనలో పుట్టిన ఆయన హయాంలోనే స్కాం జరిగింది. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక అగ్రిగోల్డ్ ఆస్తులు 21 వేల ఎకరాలు అటాచ్ చేసి, యాజమాన్యాన్ని అరెస్టు చేయించి, బాధితులకు న్యాయం చేసింది. అయినా మాపై తప్పుడు ఆరోపణలు చేశారు. ప్రతిపక్షనేతగా హామీలిచ్చి గద్దెనెక్కాక మీరు చేసిన మోసంతో రోడ్డునపడిన అగ్రిగోల్డ్ బాధితులు యువగళం పాదయాత్రలో నన్ను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో అగ్రిగోల్డ్ బాధితులకు ఇస్తామన్న సొమ్ములేవని లోకేశ్ ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వం డిపాజిటర్లకి ఇవ్వడానికి సిద్ధం చేసిన రూ.250 కోట్లు పంపిణీ చేయకుండా అడ్డుకుని తీరా అదే సొమ్ములో రూ.14 కోట్లు తగ్గించి 22 వారాల తర్వాత రూ.236 కోట్లే పంపిణీ చేశారని మండిపడ్డారు. కొంత మొత్తమే చెల్లించి చేతులు దులుపుకున్న తీరుతో బాధితులు మరింత బాధపడ్డారని అన్నారు. మానవత్వంతో పనిచేసే ప్రభుత్వం అని ప్రచారం చేసుకున్న వైసీపీ పాలనలో చనిపోయిన 600 మంది అగ్రిగోల్డ్ బాధితుల్లో ఏ ఒక్కరి కుటుంబానికైనా ఇస్తామన్న రూ.10 లక్షల పరిహారం ఇచ్చారా? అని నిలదీశారు. 'కనీసం పరామర్శ చేశారా? ఇదేనా మీ మానవత్వం?' అని అడిగారు. 2014-19 మధ్యలో బలవన్మరణాలకు పాల్పడిన 142 మంది అగ్రిగోల్డ్ బాధితుల కుటుంబాలకు నాటి టీడీపీ ప్రభుత్వం 5 లక్షల వరకు ఎక్స్ గ్రేషియా అందించిందని అన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులు అటాచ్ చేసిన టీడీపీ ప్రభుత్వంపై చేయని ఆరోపణ లేదని గుర్తుచేశారు. తాను అగ్రిగోల్డ్ భూములు కొట్టేశానని బరితెగించి రాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం అయి ఐదేళ్లయినా అగ్రిగోల్డ్‌కి చెందిన ఒక్క సెంటు ఆస్తి అయినా ఎందుకు అటాచ్ చేయలేదని ప్రశ్నించారు. అగ్రిగోల్డ్ ఆస్తులపై మీరు, మీ అనుచర గణం కన్నేసి దక్కించుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు అని అగ్రిగోల్డ్ బాధితులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికీ ఇంకా మిగిలిన 10 లక్షలకు పైగా అగ్రిగోల్డ్ డిపాజిటర్లకి మీరు దిగేలోగానైనా వారికి రావాల్సిన రూ.3080 కోట్లను చెల్లించి న్యాయం చేయాలని కోరుతున్నాను' అని నారా లోకేశ్ పేర్కొన్నారు.

# ప్రజాపాలన దరఖాస్తుల అమ్మకాలపై రేవంత్ సీరియస్

- అవసరమైనన్ని అందుబాటులో ఉంచాలని సిఎం ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :



ప్రజాపాలన దరఖాస్తుల అమ్మకాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకోవాలనుకునేవారికి ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. దరఖాస్తుదారులకు అవసరమైనన్ని దరఖాస్తులను అందుబాటు లో ఉంచాల్సిందే నని అధికారులను ఆదేశించారు. రైతుబంధు, పింఛన్లపై అపోహలకు గురి కావద్దని, పాత లబ్దిదారులందరికీ యథావిధిగా ఈ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. గతంలో లబ్ది పొందని వారు, కొత్తగా లబ్ది పొందాలనుకునేవారు దరఖాస్తు చేసుకోవాలని సీఎం అన్నారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి గందరగోళానికి గురి కావద్దని తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తుల సరళి, క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఈ నెల 28 నుంచి ప్రజా పాలన కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో ఇప్పటి వరకు జరిగిన గ్రామసభలు, దరఖాస్తుల వివరాలు, ప్రజా పాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న విధానం, ప్రజల్లో స్పందనకు సంబంధించి పూర్తి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల కొరత లేకుండా అవసరమైనన్ని దరఖాస్తులు అందుబాటులో ఉంచాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. దరఖాస్తులను అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు విధిగా భాగస్వామ్యం కావాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోను ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాపాలన క్యాంపుల్లో దరఖాస్తుదారులకు తాగునీరు, సరైన నీడ కోసం టెంట్లు, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి లోటు రాకుండా చూడాలని అధికారులకు మరోసారి స్పష్టంగా సూచించారు.

# హక్కులను కాలరాస్తోన్న జగన్ ప్రభుత్వం





- అధికారంలోకి రాగానే అంగన్‌వాడీలకు న్యాయం
- కుప్పంలో రోడ్‌షో నిర్వహించిన చంద్రబాబు



చిత్తూరు, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :

వైసీపీ ప్రభుత్వం హక్కులను కాలరాస్తోందని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అంగన్‌వాడీల సమ్మెపై నిర్లక్ష్యం తగదన్నారు. ఈ మేరకు వారికి భరోసా కల్పించారు. తాను వారికి అండగా ఉంటానని, టిడిపి అధికాంలోకి ఆగానే సమస్యలు తీరుస్తానని హామీ ఇచ్చారు. శనివారం నాడు కుప్పం టౌన్‌లో చంద్రబాబు నాయుడు రోడ్ షో నిర్వహించారు. రోడ్డు పొడవునా చంద్రబాబుకు పార్టీ శ్రేణులు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు మంగళహారలతో స్వాగతాలు పలికారు. రోడ్ షో అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద అన్న క్యాంటీన్‌కు చేరుకొని పేదలకు అన్నదాన కార్యక్రమం చంద్రబాబు చేశారు. అంగన్వాడీ శిబిరానికి వెళ్లి అంగన్వాడీల ఆందోళనకు చంద్రబాబు మద్దతు పలికారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తానని అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో సమస్యలపై పోరాడే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో 175 స్థానాలూ టీడీపీనే గెలుస్తుందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. కుప్పంలో మూడో రోజు బిజీగా పర్యటించారు. రామకుప్పం బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడారు. సీఎం జగన్ పై నిప్పులు చెరిగారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు చంద్రబాబు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలు టీడీపీవే అని ఆయన జోస్యం చెప్పారు. వైసీపీ ఎమ్మెల్యేలు ప్రజా ద్రోహులుగా... మిగతా 2వ పేజీలో..

# ఇకనైనా పాఠశాలలు బాగుపడతాయా!

తెలంగాణ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. పాత ప్రభుత్వం పని తీరును సమీక్షించడం శుభపరిమాణం. సమీక్షించాల్సిన అతి ముఖ్యమైన అంశాల్లో పాఠశాల విద్యాశాఖ ఒకటి. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ అనంతరం అత్యంత నిర్లక్ష్యానికి గురై 50% పాఠశాలలు మూసివేత అంచున నిలబడి వున్నాయి. బడి బాట, బడి పిలుస్తోంది రా, జయశంకర్ బడిబాట వంటి వాటి ద్వారా పిల్లలను బడులలో చేర్పించే కార్యక్రమాలు నిర్వహించడం వలన అదేం విచిత్రమో గాని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కావచ్చు లేదా నూతనంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో కావచ్చు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు పడిపోవడం ప్రారంభమైంది. పైకి చూడడానికి గత ప్రభుత్వం రెసిడెన్షియల్ పాఠశాలల సంఖ్యను భారీగా పెంచినట్టు కనబడడం శుభపరిణామమే అయినా వాటిలో చేరిన విద్యార్థులలో 90% ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నవారే కావడం గమనర్హం. ఒక ప్రభుత్వ వ్యవస్థను కుప్పకూల్చి మరొక ప్రభుత్వ వ్యవస్థను నిర్మించడం నిర్మాణాత్మక అభివృద్ధి ఎలా అవుతుంది? ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యా రంగంలో పని చేస్తున్న మేధావులు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి రెసిడెన్షియల్స్‌గా మార్చాలని డిమాండ్ చేస్తే దానికి బదులుగా కొత్త వ్యవస్థను తీసుకొచ్చి వున్న వ్యవస్థను నాశనం చేశారు. అలాకాకుండా ప్రభుత్వ పాఠశాలలనే రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చి ఆ ఖర్చంతా వీటి వసతుల కల్పనకు పెట్టి ఉంటే ప్రతి మండలంలోని బడులన్నీ బాగుపడేవి. భూమితో పాటు బోలెడంత డబ్బు ఆదా అయ్యేది. ముప్పై ఏళ్ళ క్రితమే ప్రైవేటులో నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి లాంటి ప్రీ ప్రైమరీ విద్యకు అనుమతిని ఇచ్చి, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీని ప్రారంభించకుండా గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు తప్పు చేస్తే, కెజి టు పిజి అనే అందమైన అబద్ధపు నినాదాన్ని ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వం కెజిని ప్రారంభించలేదు సరికదా పిజిని సంస్కరించకుండానే ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు అనుమతిని ఇచ్చి అదే తప్పు చేసారు. ముప్పై ఏళ్ళ క్రితమే అడ్మిషన్ వయసును ప్రైవేటులో 3 సం? రాలకు తగ్గించిన విద్యా శాఖ ప్రభుత్వ పాఠశాలల్లో నేటికీ 5ం సం?రాలు కొనసాగిస్తున్నది. నర్సరీలో ప్రైవేటుకు వెళ్ళినవాడు 1వ తరగతికి ప్రభుత్వ పాఠశాలకు ఎలా వస్తాడు? ఐఐటి, మెడికల్‌లాంటి ఎంట్రెన్స్ పరీక్షలను ఎదుర్కొనే విధంగా ఇ-టెక్నో, కాన్సెప్ట్, ఒలింపియాడ్ స్కూల్స్, కళాశాలలు ప్రభుత్వ రంగంలో ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నా నేటికీ ఎందుకు ప్రారంభం కాలేదు? ఒకవేళ ఇవన్నీ జరిగి ఉంటే ప్రభుత్వ పాఠశాలలు ఈ దుర్భర స్థితికి వచ్చి ఉండేవి కావు. కొత్త ఉద్యోగాలు సృష్టించబడి చాలా మంది నిరుద్యోగులకు అతిపెద్ద ఉపాధి కేంద్రంగా విద్యా వ్యవస్థ ఉండేది. పాఠ్యపుస్తకాలలో, బోధనలో ఎటువంటి ప్రయోగాలు లేకుండా ప్రైవేటు పాఠశాలలు అద్భుతంగా పరిఢవిల్లుతుంటే, మెరుగైన ఫలితాలు సాధిస్తుంటే, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాల పాడు కాలం ఎందుకు నడుస్తున్నది? ఎపెప్, డిపెప్, క్యూఐపి, ఎల్ఇపి, నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ), నిష్ఠ లాంటి ప్రయోగాలన్నీ ప్రపంచ బ్యాంకు కుట్రలో పావులుగా మారిన కొంత మంది వాళ్ళ పదవులు, డిప్యూటేషన్లు పది కాలాల పాటు కాపాడుకునే సూడో మేధావుల సృష్టి. సంవత్సరానికో ప్రయోగం. ఏ ప్రయోగం ఏం ఫలితం సాధించిందో ఇప్పటికీ బహిరంగ పరుచలేదు! వీటి వల్ల ప్రజల్లో పాఠశాల విద్యా వ్యవస్థ పట్ల ఉండే విశ్వాసం దెబ్బతినడమే కాదు విద్యార్థుల సంఖ్య దారుణంగా పడిపోయింది. ఈ మధ్య కాలంలో జరిగిన సర్వేలన్నీ పిల్లలకు చదవడం, రాయడం రావడం లేదని చెబుతుంటే ఎసి గదుల్లో కూర్చోన్న మేధావులు మాత్రం ఉపాధ్యాయుడు పాఠాలు ఎలా బోధించాలో శిక్షణల పేరుతో శిక్ష విధిస్తూ ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి లాంటి కొత్త ప్రయోగాలను వద్దో మొర్రో అని మొత్తుకున్నా, మమ్మల్ని పాఠాలు చెప్పనివ్వండని అరిచిగీపెట్టిన బలవంతంగా రుద్దుతున్నారు. వీటిలో భాగంగా విద్యార్థులతో చదవడం, రాయడం చేయించాల్సిన ఉపాధ్యాయులు వార్షిక ప్రణాళికలు, పాఠ్యప్రణాళికలు, పీరియడ్ ప్రణాళికలు, డైరీలు రాయడంలో, చదవడంలో తనకో ప్రైవేటు లైఫ్ వుందనే విషయమే మరిచిపోయి తలమునకలు అవుతుండటం, టెన్షన్స్ పెరిగి రోగాల పాలై హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతుండటం ఎంత దురదృష్టకరం! ఏకోపాధ్యాయుడు లేదా ఇద్దరు ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్‌ను ప్రాథమిక స్థాయిలో 5 తరగతులకు ఎలా అమలు చేయగలరు? ఉపాధ్యాయులు తరగతి గదుల్లో బోధించాల్సిన సోపానాలను బట్టి పట్టాలి. వాటిని అడగడానికి, వాటి ప్రకారం బోధిస్తున్నారా లేదా పరిశీలించడానికి వందల మంది ఉపాధ్యాయులను వాళ్ళు పనిచేసే బడులను నాశనం చేసి డిప్యూటేషన్లు పెట్టి, తనిఖీ బృందాలను ఏర్పరిచి వారి సమాన క్యాడర్‌కు చెందిన సహచర ఉపాధ్యాయుల తరగతి గదుల్లో కూర్చొని పరిశీలించమనడం ఎంత సిగ్గుచేటు! యంఇఒ, డిప్యూటీ ఇఒ లాంటి పర్యవేక్షక పోస్టులు ఎందుకు నింపరు? విద్యార్థే అన్నీ అర్థం చేసుకోవాలి, నేర్చుకోవాలి, ఉపాధ్యాయుడు ఏమీ బోధించకూడదట! అక్షరాల నుండి పదాలు, వాక్యాలు నేర్చుకోవడానికి బదులుగా వాక్యాల నుండే అక్షరాలు నేర్చుకోవాలని పుస్తక రచయితలుగా అవతారమెత్తిన ఉపాధ్యాయులు సెలవిచ్చి ప్రాథమిక స్థాయి పాఠ్యపుస్తకాలు రాయడం వల్ల ప్రభుత్వ విద్యార్థులు చదువు రాకుండా అయితే, ఆ సర్‌తో అధ్యయనం చేయించి విద్యార్థికి చదువు రావడం లేదని ఉపాధ్యాయుడిని దోషిగా చూపి ప్రభుత్వ పాఠశాలలను బదునాం చేసి మూసివేత కుట్రకు తెరలేపి ప్రైవేటుకు దారులు వేయడం ఎంత పెద్దకళో కదా! మార్చిలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థిని జూన్‌లో పై తరగతికి ప్రమోట్ చేయడం ఏ విధంగా కరెక్ట్! కనీస స్థాయికి చేరుకోని వారిని డిటెన్షన్ ఎందుకు చేయరు? సిసిఇని ప్రవేశపెట్టిన సిబిఎస్ఇ, 21 రాష్ట్రాలు దాని దుష్ఫలితాలను సమీక్షించుకొని, వెంటనే రద్దు చేసుకొని పాత పద్ధతిని ప్రవేశపెట్టుకుంటే, మన రాష్ట్రంలో మాత్రం ఇది తప్పుడు విధానమని ఉపాధ్యాయులు, సంఘాలు, తల్లిదండ్రులు చెప్పి రద్దు చేయాలని డిమాండ్ చేసినా ప్రభుత్వం పెడచెవినపెట్టింది. విద్యార్థికైతే రోజు పరీక్షలే! పరీక్ష లేని రోజంటు ఉండదు. విద్యార్థులపై పెరిగిన పరీక్షల భారాన్ని తగ్గించి సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి బోధనకు, చదవడానికి, రాయడానికి విద్యార్థికి అధిక సమయం కేటాయించడానికి చర్యలు తీసుకోవడానికి బదులుగా విద్యాశాఖ, ఎస్‌సిఇఆర్‌టిలో రిటైరైనా మేధావులు దానిని వదిలి పెట్టడకుండా కేవలం తమ పదవులను కాపాడుకోవడానికి తిష్ట వేసుకొని గబ్బిలాల్ల వేలాడుతూ శిక్షణల మంత్రాగాన్ని నడుపుతూ విద్యా వ్యవస్థను పగబట్టి సర్వనాశనం చేసి పతనం అంచుకు తీసుకువచ్చారు. మన ఊరు, మన బడి మంచి పథకమే అయినా చెరువులో నీళ్ళు చెరువెనుకబడ్డ తర్వాత ప్రారంభించబడిందనే అపవాదుతోపాటు కొన్ని పాఠశాలల్లోనే అది ప్రారంభమైంది. వేల కోట్ల రూపాయలతో పాఠశాలల్లో కంప్యూటర్లతో గదులను నెలకొల్పి, వున్న బోధకున్ని తీసేసి వాటిని మూలకు బడేసి విద్యార్థులను గ్లోబల్ సిటీజన్ తయారు చేయాలనే పీడకలకంటున్న అధికారులు, ప్రభుత్వం వున్న కాలం ఇది! ప్రైవేటులో కంప్యూటర్లపై పిల్లలు ఆటలాడుతుంటే మన ఘనత వహించిన విద్యాశాఖ పనికి మాలిన శిక్షణలు ఇస్తూ పరువు తీసుకుంటున్నది. సమావేశాలపై సమావేశాలు, నివేదికలపై నివేదికలు, రిపోర్టులపై రిపోర్టులు కంప్యూటర్ యుగంలో కూడా అడిగిన వాటినే అడగడం లాంటివన్నీ కేవలం ఉపాధ్యాయున్ని తరగతి గదికి దూరం చేసే కుట్రలో భాగమే! 98% పాఠశాలలు అటెండర్, స్వీపర్, స్కావెంజర్, క్లర్క్ లేకుండా ఉపాధ్యాయులే ఆ విధులు నిర్వహిస్తూ కాలం వెళ్ళదీస్తుంటే తనిఖీల పేరుతో అధికారులు, నాయకులు మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం బాగా లేవని సస్పెండ్ చేయడం ఎంత దౌర్భాగ్యం! రైతులకు, పేదలకు ఉచిత కరెంట్ ఇచ్చే పాలకులకు బడులకు ఉచిత కరెంట్ ఇవ్వాలని ఎందుకు గుర్తుకురాదో అర్థం కాదు! పాఠశాలలకు ఇచ్చే నిధులు విద్యుత్ బిల్లుకే సరిపోవు. లైబ్రరీలు, ల్యాబ్‌లు అటుంచి 50% పాఠశాలల్లో నేటికీ టాయిలెట్ లాంటి కనీస మౌలిక వసతుల కల్పన కూడా జరుగపోవడం చాలా దురదృష్టకరం. గత ప్రభుత్వంలా కాకుండా ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం అడ్మిషన్ వయసు 3 సం? రాలకు తగ్గించడంతో పాటుగా, ఇప్పటికే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కెజి, యుకెజిలను ప్రవేశపెట్టడంతో పాటు ప్రాథమిక పాఠశాలలను సెమి రెసిడెన్షియల్స్‌గా, హైస్కూల్స్ అన్నింటిని రెసిడెన్షియల్స్‌గా మార్చాలి. ఈ ప్రయోగాలను, శిక్షణలను ఆపి, అన్ని రాష్ట్రాల్లాగే సిసిఇని రద్దు చేసి, సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టాలి. ఒక పాఠశాలను ఒక యూనిట్‌గా తీసుకొని మౌలిక వసతులతో పాటు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించి కంప్యూటర్ విద్య ప్రాధాన్యతను పెంచడంతో పాటు లైబ్రరీలు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు నెలకొల్పాలి. తరగతి గదికో ఉపాధ్యాయున్ని నియమించాలి. మండల విద్యాధికారి కార్యాలయాలతో పాటు ప్రతి పాఠశాలకు స్కావెంజర్, అటెండర్, క్లర్క్‌ను నియమించాలి. ఇంచార్జ్‌ల వ్యవస్థను రద్దు చేసి అన్ని స్థాయిల్లో పర్యవేక్షక పోస్టులను నింపాలి. డిప్యూటేషన్లను రద్దు చేసి విద్యాశాఖను భ్రష్టు పట్టిస్తున్న రిటైర్డ్ మేధావులను తొలగించాలి. ఇకనైన ఉపాధ్యాయులు, మేధావులు, ప్రజలు, ప్రజాసంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు కళ్ళు తెరిచి గ్లోబలైజేషన్ విసిరిన సవాల్‌కు తగ్గట్టుగా పాఠశాలలను సంస్కరించాలనే డిమాండ్‌ను ప్రభుత్వాల ముందు ఉంచాలి. అందుకు తగ్గట్టుగా పౌరులను తయారు చేస్తామని హామీ ఇస్తే తప్ప ప్రభుత్వ పాఠశాలలను ప్రజలు విశ్వసించరు.

# హక్కులను కాలరాస్తోన్న జగన్ ప్రభుత్వం





(మొదటి పేజీ తరువాయి)

మారారని, అందుకు కారణమైన సైకో పాలనకు బుద్ధి చెప్పాలని చంద్రబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఒక్క కొత్త పరిశ్రమ కూడా రాలేదని, ఏ ఒక్కరికి ఉద్యోగావకాశం కల్పించలేదని పేర్కొన్నారు చంద్రబాబు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన తాను ఏ రోజు ఏ తప్పు చేయలేదని ఆయన స్పష్టం చేశారు. నాకు వయసు ఓ నంబర్ మాత్రమే. నా ఆలోచనలు 15 ఏళ్ల యువకుడిలా ఉంటాయి. వచ్చే 20 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆలోచిస్తాను. కుప్పంలో లక్ష్య ఓట్ల మెజారిటీ లక్ష్యం. తప్పనిసరిగా సాధిస్తాం. హంద్రీనీవాలో నీళ్ళు పారించమంటే అవినీతి పారిస్తున్నారు. బటన్లు నొక్కి డబ్బులు ఇవ్వకుండా మోసం చేస్తున్నారు. అందరూ రోడ్డున పడ్డారు. సీఎం మాత్రం ప్యాలెస్ లో ఉన్నారు. వాటాలు అడుగుతున్న కారణంగా రాష్ట్రానికి పెట్టుబడులు రావడం లేదు. వచ్చే ఎన్నికల్లో ఓడిపోతున్నట్లు జగన్ కి అర్థం అయ్యే ఉంటుంది. బటన్ నొక్కి డబ్బులు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని దీంతో ప్రజలు రోడ్డున పడ్డారని, సీఎం జగన్ మాత్రం ప్యాలెస్ లో ఉన్నాడని చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో ఈ తరహా రాజకీయాలు మునుపెన్నడూ చూడలేదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. హంద్రీనీవా లో నీళ్లు పారించమంటే, అవినీతి పారిస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావడంలేదని, వాటాలు అడుగుతున్న కారణంగా పెట్టుబడులు ఎవరు పెట్టడం లేదని చంద్రబాబు ఆరోపించారు. ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైంది. మీ దాడులకు నేను భయపడను. మీరు తిన్నది కక్కిస్తాను. జగన్.. సామాజిక న్యాయం ఎక్కడ చేశావు? వైసీపీలో సామాజిక న్యాయం నేతి బీర నెయ్యి చందం. వైసీపీలో రెడ్లు ఎవ్వరూ బాగుపడలేదు. నలుగురు రెడ్లు పెద్దిరెడ్డి, సజ్జల, సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డిలు మాత్రమే బాగుపడ్డారు. మారాల్సింది ఎమ్మెల్యే అభ్యర్థులు కాదు.. సీఎం మాత్రమే. కుప్పంలో లక్ష ఓట్ల మెజారిటీ వస్తే రాష్ట్రంలో 175 స్థానాలు మనవే. గాడి తప్పిన పాలన మళ్లీ సరి చేయాలి. ఇదే నా కోరిక అని చంద్రబాబు నాయుడు అన్నారు.

# అయోధ్య కోసం 550 ఏళ్లు వేచిచూశాం

(మొదటి పేజీ తరువాయి)

రామమందిరం ప్రారంభమయ్యే ఘడియల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. 22న మరో దీపావళి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అయోధ్యలో సుందర శ్రీరామ మందిర నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. తుది దశకు చేరుకున్న ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ తరుణంలో అయోధ్యలో పర్యటించిన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం రోజు జనవరి 22న దేశ ప్రజలందరూ దీపావళి జరుపుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఆ రోజున సాయంత్రం ప్రతి ఇంట్లో దీపం వెలగాలన్నారు. అందుకే జనవరి 22 వ తేదీన అయోధ్యలో ఉండే రద్దీ కారణంగా భక్తులు ఎవరూ అయోధ్యకు రావొద్దని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఆ తర్వాతి రోజు అంటే జనవరి 23 వ తేదీ నుంచి జీవితాంతం శ్రీరాముడిని దర్శించుకోవచ్చని మోదీ సూచించారు. ప్రజలు ఎవరూ అయోధ్యకు వచ్చి ఇబ్బంది పడకూడదనే ఈ సూచన చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు ప్రధాని మోదీ. ఆధ్యాత్మిక నగరి అయోధ్యలో ఆధునిక హంగులతో పునరుద్ధరించిన రైల్వేస్టేషన్ తోపాటు మహర్షి వాల్మీకి ఎయిర్‌పోర్టును ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితమిచ్చారు. రెండు అమృత్ భారత్ రైళ్లు, ఆరు వందేభారత్ రైళ్లకు పచ్చజెండా ఊపారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన జనవరి 22న అయోధ్యకు రావద్దని ప్రజలను కోరారు. మీరు 550 సంవత్సరాలకు పైగా వేచి ఉన్నారు, మరికొంత కాలం వేచి ఉండండి అంటూ పిలుపునిచ్చారు. కాగా ఆశ్వయుజ మాసంలోని అమావాస్య రోజున లంకను జయించి.. సీతాదేవితో కలిసి శ్రీ రాముడు అయోధ్య కు తిరిగొచ్చాడని అంటారు. రామయ్య రాకను స్వాగతిస్తూ అయోధ్య ప్రజలు దీపాలు వెలిగిస్తారట. ప్రస్తుతం రాముడి ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో మోదీ ఈ మేరకు పిలుపునిచ్చారు. శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ట తరువాత, తమ సౌలభ్యం ప్రకారం అయోధ్యకు రావాలని సూచించారు. జనవరి 22న ఇక్కడికి రావడానికి తమ మనస్సును మార్చుకోకండి అంటూ విజ్ఞప్తి చేశారు. ఈ మహత్తర కార్యక్రమానికి సన్నాహాలు ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయని, ఇందులో ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని ప్రధాని మోదీ అన్నారు. గుడి ఎక్కడికీ వెళ్లదు కాబట్టి ఇక్కడ రద్దీగా ఉండకండి. ఇది శతాబ్దాల పాటు కొనసాగుతుంది. ఈ వేడుకకు కొందరికే ఆహ్వానం అందిందని ప్రధాని తెలిపారు. అందుచేత ఆహ్వానించబడిన వారు మాత్రమే అయోధ్యకు రావాలన్నారు. జనవరి 23వ తేదీ తర్వాత ప్రతి ఒక్కరికి ఆయోధ్య ప్రయాణం సులువవుతుందన్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టం అదృష్టవశాత్తూ మనందరి జీవితాల్లోకి వచ్చిందని, ఈ సందర్భంగా 140 కోట్ల మంది దేశప్రజలు జనవరి 22న తమ ఇళ్లలో శ్రీరామజ్యోతిని వెలిగించి దీపావళిని జరుపుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా, అయోధ్య నగరాన్ని పరిశుభ్రంగా మార్చాలని ప్రధాని మోదీ ప్రజలను కోరారు. అయోధ్య ఇప్పుడు లక్షలాది మంది సందర్శకులకు ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలన్నారు. నిత్యం సందర్శకులు ఇక్కడికి వస్తూనే ఉంటారు. అయోధ్యను దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా మార్చేందుకు అయోధ్య ప్రజలు ప్రతిజ్ఞ చేయవలసి ఉంటుందని ప్రధాని మోదీ అన్నారు. డిసెంబర్ 30వ తేదీ భారతదేశ చరిత్రలో ఎప్పటికీ చిరస్థాయిగా ఉండిపోతుందని, ఇండియా ఫ్రీడం ప్రకటన చేస్తూ నేతాజీ సుభాస్ చంద్రబోస్ 1943లో ఇదేరోజు అండమాన్‌లో భారతదేశ పతాకాన్ని ఆవిష్కరించారని గుర్తు చేశారు. ప్రపంచంలోని ఏదేశమైనా అభివృద్ధిలో పతాక స్థాయికి చేరుకోవాలనుకుంటే ఆ దేశవారసత్వ సంపదకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మోదీ అన్నారు. రామ్ లల్లా ఒక టెంట్‌లో ఉండేవాడని, ఇవాళ రామ్‌లల్లాకు ఆలయం ఉవ్వడం జరిగిందని, రామ్ లల్లాకు మాత్రమే కాకుండా దేశంలోని 4 కోట్ల పేద ప్రజానీకానికి పక్కా ఇళ్లు కల్పించామని చెప్పారు. అయోధ్యలో ఈరోజు రూ.15,000 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభమయ్యాయని, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ఈ పనులు పూర్తయితే మోడ్రన్ అయోధ్య రూపుదిద్దుకుని దేశానికి గర్వకారణంగా నిలుస్తుందని అన్నారు. అయోధ్య అభివృద్ధి స్థానికులకు మరిన్ని ఉపాధి అవకాశాలు దొరుకుతాయని తెలిపారు. నేడు భారతదశం పర్యాటక స్థలాల సుందరీకరణతో పాటు డిజిటల్ టెక్నాలజీతో యావత్ ప్రపంచం దృష్టిని ఆకట్టుకుంటోందని చెప్పారు. అయోధ్య ధామ్ జంక్షన్‌తో పాటు ఎయిర్‌పోర్ట్‌ని ప్రారంభించుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు ప్రధాని మోదీ. ఎయిర్‌పోర్ట్‌లో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరూ ఆ వాల్మీకి మహర్షిని స్మరించుకుంటారని అన్నారు. అందుకే విమానాశ్రయానికి ఆ మహర్షి పేరు పెట్టామని తెలిపారు. అయోధ్య రైల్వేస్టేషన్ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాక 70 వేల మంది ప్రయాణించేందుకు అవకాశం లభిస్తుందని వెల్లడించారు. ఆలయాల పునర్నిర్మాణాలతో పాటు అభివృద్ధిలోనూ భారత్ దూసుకుపోతోందని స్పష్టం చేశారు. అయోధ్యలో కొత్త టౌన్‌షిప్ నిర్మాణం జరుగుతోందని ప్రకటించారు. తొలి అమృత్ భారత్ రైలు అయోధ్య నుంచే ప్రారంభమవుతుందని వెల్లడించారు. అయోధ్య ధామ్ జంక్షన్‌తో పాటు ఎయిర్‌పోర్ట్‌ని ప్రారంభించుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు ప్రధాని మోదీ. ఎయిర్‌పోర్ట్‌లో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరూ ఆ వాల్మీకి మహర్షిని స్మరించుకుంటారని అన్నారు. అందుకే విమానాశ్రయానికి ఆ మహర్షి పేరు పెట్టామని తెలిపారు. అయోధ్య రైల్వేస్టేషన్ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాక 70 వేల మంది ప్రయాణించేందుకు అవకాశం లభిస్తుందని వెల్లడించారు. ఆలయాల పునర్నిర్మాణాలతో పాటు అభివృద్ధిలోనూ భారత్ దూసుకుపోతోందని స్పష్టం చేశారు. ఈ రామ మందిర నిర్మాణ అయోధ్య వాసుల కష్టానికి ప్రతిఫలం అని తేల్చి చెప్పారు. దేశ చిత్రపటంలో అయోధ్యను ప్రత్యేకంగా నిలబెడతామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి అయోధ్య స్ఫూర్తిగా మారనుందని అన్నారు. ఇక్కడికి వచ్చే ప్రతి భక్తుడికీ సులభంగా రాముడి దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేస్తామని స్పష్టం చేశారు. కాగా, ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, గవర్నర్ ఆనందిబెన్ పటేల్, బ్రిజేష్ పాఠక్ కేశవ్ మౌర్య తదితరులు పాల్గొన్నారు.



# షర్మిల వెంటే నా రాజకీయ ప్రయాణం

- **మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్లనాని ప్రకటన**
- **జగన్ కరివేపాకులా వాడుకుని వదిలేశారని ఆవేదన**

**గుంటూరు, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

వైతెపా అధ్యక్షురాలు షర్మిల కాంగ్రెస్‌కు వెళ్లేది నిజమే అయితే.. తానూ ఆమె వెంటే నడుస్తానని ఇటీవల ఎమ్మెల్యే పదవికి, వైకాపా పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) వెల్లడించారు. నేను ఏ పార్టీలో ఉంటాననేది కాలమే నిర్ణయిస్తుంది. వైకాపాకు నేను ఎంత సేవ చేశానో నాకు తెలుసు. నేను సర్వస్వం పోగొట్టుకున్నాను. ఇకపై వైఎస్ షర్మిల వెంట నడుస్తా. షర్మిలమ్మ ఏ నిర్ణయం తీసుకున్నా ఆమె వెంటే ఉంటానని అంటూ..మంగళగిరిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. వైకాపాకు సిద్ధాంతాలు ఉండాలి. మంగళగిరి ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు. రూ.1200 కోట్లతో అభివృద్ధి చేస్తామని చెప్పి రూ.120 కోట్లను మాత్రమే కేటాయించారు. నా సొంత డబ్బుతో నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి పనులు చేశా. 50 ఏళ్లలో జరగని అభివృద్ధి నాలుగేళ్లలో చేసి చూపించా. స్వయంగా నేనే రూ.8 కోట్ల వరకు బయట అప్పులు తెచ్చి కాంట్రాక్టర్లకు ఇచ్చాను. లోకేశ్‌ను ఓడించిన నాకు సహకారం అందించకపోతే ఎలా? నేను ఎవరినీ నిందించడం లేదు. నిధులు మంజూరు చేస్తానని నాకు ధనుంజయ రెడ్డి చాలా సార్లు సందేశాలు పెట్టారు. ఎన్నికలు దగ్గరకు వచ్చినా ఇంకెప్పుడు నిధులు మంజూరు చేస్తారు. రాజీనామా ఆమోదించకపోవడం అనేది వాళ్ల ఇష్టం. నేను స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా ఇచ్చా. ఎవరు గెలవాలని నిర్ణయించేది ప్రజలే. నేను ఏ పార్టీలో చేరినా అదే రోజే నిర్ణయం చెబుతా. గతంలో వైకాపాలోనే ఉంటానని చెప్పి ఇప్పుడు పార్టీని వీడాను. దీనికి సీఎం జగనే సమాధానం చెప్పాలి. చాలా మంది నన్ను ఇతర పార్టీల్లోకి రావాలని ఆహ్వానించారు. వైఎస్ కుటుంబంతోనే ఉన్నా.. ఉంటానని వారికి చెప్పానని అన్నారు. చంద్రబాబుపై వేసిన కేసులపై న్యాయ పోరాటం చేస్తా. వైకాపా ప్రభుత్వం తప్పు చేస్తే వాటిపై కేసులు వేసేందుకు అయినా వెనకాడను. తప్పులు ఎవరు చేశారు అనేది న్యాయస్థానాలు తేలుస్తాయి. నేను లేకపోయినా మంగళగిరి అభివృద్ధి ఆగదు. నాకు జగన్ టికెట్ ఇవ్వలేదని నేను పార్టీని వీడలేదు. పొమ్మన లేక పొగపెట్టారు. నాకు, చిరంజీవికి, జగన్‌కు మధ్య ఏమి జరిగిందనేది మా అందరికీ తెలుసని ఆళ్ల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి సోదరి వైఎస్ షర్మిలతోనే తన రాజకీయ ప్రయాణమని ప్రకటించారు. జగన్ రెడ్డి మంగళగిరిలో తనకు తీవ్ర అన్యాయం చేశారని పునరుద్ఘాటించారు. భవిష్యత్తులో షర్మిల వెంటే నడుస్తానని, ఆమె ఏ నిర్ణయం తీసుకున్నా ఆమెతోనే పయనిస్తానని తెలిపారు. తాను రాజకీయాల్లోనే కొనసాగుతానని క్లారిటీ ఇచ్చారు. త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని ఆళ్ల రామకృష్ణారెడ్డి చెప్పారు. పార్టీలో నుంచి పొమ్మనలేక పొగబెట్టారని చెప్పారు. మంగళగిరిని అన్నివిధాలా అభివృద్ధి చేశానన్నారు. తన నియోజకవర్గానికి నిధులు కేటాయించలేదని ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. తన సొంత డబ్బుతో కొన్ని పనులు చేశానన్నారు. అభివృద్ధి చేయకుండా మళ్లీ ఓట్లు ఎలా అడగాలని ప్రశ్నించారు. సీఎం జగన్ తప్పులు చేస్తే కేసులు వేస్తానని హెచ్చరించారు. నైతిక విలువలు పాటిస్తూ రాజీనామా చేశానని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. కాగా ఆళ్ల రామకృష్ణా రెడ్డి ఇటీవలే ఎమ్మెల్యే పదవి, వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

# సామాజిక న్యాయ బస్సుయాత్రను విజయవంతం చేయాలి





- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

**కర్నూలు, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

పాణ్యం నియోజకవర్గంలో జనవరి 4వ తేదీ జరిగే సామాజిక న్యాయ బస్సుయాత్రను విజయవంతం చేయాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తెలిపారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి జనవరి 4 వ తేదీన జరిగే సామాజిక న్యాయం బస్ యాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలు మరియు కల్లూరు అర్బన్ లోని ప్రజాప్రతినిధులు(జడ్పీటీసీలు, ఎంపీపీ లు,సర్పంచులు, ఎంపిటిసిలు, కార్పొరేటర్లు) వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు మాయ మాటలు ప్రజలు నమ్మరు





- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

**పెద్దకడబూరు, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

టీడీపీ అధినేత చంద్రబాబు మాయ మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. శనివారం పెద్దకడబూరు మండల పరిధిలోని కంబలదిన్నె గ్రామంలో గ్రామ సర్పంచ్ తిమ్మక్క, నరసప్ప ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నారని కొనియాడారు. వైఎస్ జగన్ తోనే పేదల అభివృద్ధి సాధ్యమన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆరు గ్యారెంటీల పేరుతో మీ ముందుకు వస్తారని, ఆయన మాటలు నమ్మి మరోమారు మోసపోవద్దని ఎమ్మెల్యే హితవు పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జనవరి నెల నుంచి పింఛన్లు 3000 వేల రూపాయలకు పెంచారన్నారు . ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని 2024 ఎన్నికల్లోనూ మళ్లీ జగనే సీఎంగా, మీ వెంటే ఉండే నన్ను ఎమ్మెల్యేగా దీవించాలని కోరారు. అనంతరం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కబడ్డీ ఆడుతూ ప్రజలను, యువకులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర యువనాయకులు ప్రదీప్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర రెడ్డి, మాజీ ఎంపిపి రఘురామ్, సచివాలయ జేసీఎస్ కన్వీనర్ రవిచంద్రా రెడ్డి, నాయకులు గజేంద్రరెడ్డి, విజయేంద్ర రెడ్డి, పెద్దకడబూరు గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, ఇస్మాయిల్, ముక్కరన్న, కోస్గీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అర్లప్ప,యల్లప్ప, ఈరన్న, భీమన్న, మారెన్న, అళ్లయ్య, అంజినయ్య, బసన్న, ఎంపీడీఓ ప్రభాకర్, ఏఈ లు మల్లయ్య, సాయి కుమార్, వీఆర్వో సంజీవరావు, పంచాయతీ కార్యదర్శి మహేంద్ర, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఖాళీ ప్లేట్లతో డప్పు కొడుతూ అంగన్వాడీలు వినూత్న నిరసన

**పెద్దకడబూరు, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**



వేతనాలు పెంచాలని 18 రోజులుగా అంగన్వాడీలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా పెద్దకడబూరులోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీఐటీయు ఆధ్వర్యంలో శనివారం అంగన్వాడీలు ఖాళీ ప్లేట్లతో డప్పు కొరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు వైసీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సంఘం నాయకురాలు జయమ్మ, చిట్టెమ్మ, సుకన్య, నాగరత్నమ్మ మాట్లాడుతూ అంగన్వాడీలు న్యాయమైన డిమాండ్లతో గత 18 రోజులుగా వివిధ రీతులలో ఆందోళన చేస్తున్నా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి చీమ కుట్టినట్లు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనంలో భాగంగా అంగన్వాడీలకు నెలకు రూ. 26 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఎన్నికల ముందు అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నెరవేర్చాలని కోరారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈఓఆర్డీ జనార్ధన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## ఆదాయంలో పేదల వాటా ఎంత?

ప్రభుత్వ ఆదాయం, చేస్తున్న అప్పుల్లో అధికభాగం ఉద్యోగులకు, మధ్యతరగతికే పోతోంది. కానీ వీరు మాత్రం పేదలకిచ్చే ఉచితాలు దండగ అంటుంటారు. పేదలకు ఉచితాలపై ఇంత రాద్ధాంతం చేయడం ఏం న్యాయం? ఉచిత విద్య ఉచిత వైద్యం, ఉండడానికి కాస్త నీడనివ్వడం కనీస ధర్మం కాగా, వీటిని ఉచితాలంటూ ఆరోపించడం తగదు. కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన శ్వేత పత్రం ఒక వాస్తవాన్ని విప్పి చెప్పింది. రెండు శాతం ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు, సౌకర్యాల కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో 33 శాతం ఖర్చవుతుందని, అప్పులు చెల్లించడానికి 34 శాతం ఖర్చవుతుందని, మిగిలిన ఆదాయమే అభివృద్ధి సంక్షేమ పథకాలకు మిగులుతున్న సొమ్ము అని శ్వేతపత్రం వెల్లడించింది. దీని ప్రకారం.. నాలుగు కోట్ల ప్రజల వద్ద వసూలు చేసిన పన్ను ఆదాయంలో 33 శాతాన్ని కేవలం రెండు శాతంగా ఉన్న ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లిస్తున్నది! ఇది ఎవరి సంపద? సంపద సృష్టిలో వారి కంట్రిబ్యూషన్ ఎంతెంత? వ్యాపారాల్లో సంపద ధర పెంచి అమ్మితే లాభాలు వస్తాయి. అది సంపదను వ్యాపారులు తమ ఆదాయంగా మలుపు కోవడమే కద! అది సంపద సృష్టించడం కాదు కదా! సంపద సృష్టించకుండా సంపదను కైవసం చేసుకునే వారంతా పరాన్న భుక్కులు. ఆశ్రిత వర్గాలు. అలాంటి వారు కట్టిన పన్నులతో పేదల సంక్షేమ పథకాలు నడుస్తున్నాయనుకోవడం తప్పుడు ప్రచారం. ప్రభుత్వాలు తెచ్చిన రూ. 6.71 లక్షల కోట్ల అప్పులు ఎవరిపాలయ్యాయి? అందులో పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం వెచ్చించినదెంత? పేదలను అభివృద్ధి పరిస్తే ఇంత పేదరికం ఎందుకుంది? ఉన్న వూరు వదిలి వలసలు పోవడం ఎందుకు జరుగుతున్నది? అభివృద్ధి పేర, ప్రాజెక్టుల పేర సౌకర్యాల పేర చేస్తున్న వ్యయం ద్వారా పేదలు పొందుతున్న లబ్ధి ఎంత? గుంట భూమి లేనివారికి, ఇంట్లో కరెంటు లేనివారికి ఆయా రంగాల్లో చేసే వ్యయం వల్ల పేదలకు ఏం ప్రయోజనం కలుగుతోంది? వాటివల్ల లాభపడుతున్నదెవరు? రైళ్లు, విమానాలు, ఫ్లై ఓవర్లు వల్ల లాభపడుతున్నదెవరు? తమ విషయంలో ప్రభుత్వాలు ఉదారంగా ఉండాలనీ, అన్ని సౌకర్యాలూ కల్పించాలనీ కోరుకునే మధ్య తరగతి ప్రజలు పేద వర్గాల పట్ల వారికి ప్రభుత్వం చేయూత పట్ల కొందరు అసహనం కోపం వ్యక్తం చేయడం అవసరమా? వీరినే మధ్యతరగతి మహా మేధావులని అంటున్నాను. వీరు చేసే విమర్శలకు ప్రాతిపదిక తాము టాక్స్ పేయర్సుగా కడుతున్న పన్ను పేదలకిచ్చే సొమ్ము అని! ఈ విషయం నిగ్గు తేల్చడం ఈ వ్యాసం పరిమితి. మధ్యతరగతి తమ ఆదాయం నుండి పన్ను చెల్లిస్తున్నామని అంటారు. ఈ మధ్య తరగతి ఆదాయం మూలంలోకి వెళ్లి చర్చిస్తే తప్ప వాస్తవం బోధపడదు.

**సంపద సృష్టిస్తోందెవరు?**

ఆదాయం, సంపద, సంపద సృష్టి, ఉత్పత్తి, అనేవి ప్రత్యేక అర్థాలు కలిగి వుంటాయి. సంపద సృష్టించకుండా, ఏ ఉత్పత్తి చేయకుండా వ్యవసాయం, పశు పోషణ, ఆహార సేకరణ, వేట వంటివాటితో అధిక ఆదాయం పొందేవారు చాలా మంది ఉంటారు. వీరిని పరాన్న భుక్కులు, డిపెండెంట్‌లు, అంటారు. సేవారంగంలో పనిచేసేవారిని కూడా డిపెండెంట్‌లనే అంటారు. ఈ దేశంలో సంపద సృష్టించకుండా, ఏ ఉత్పత్తి చేయకుండా అధిక ఆదాయం పొందడం, అధిక సంపద పోగు చేయడం, ఆధిపత్యంలో ఉండడం.. వీరే అసమానతలకు, దోపిడికి, ప్రజల పేదరికానికి దోపిడీకి మూలం. మన దేశంలో మధ్య తరగతి ప్రజలు సమాజంలో సృష్టిస్తున్న సంపద ఎంత? సమాజం నుండి వీరు పొందుతున్న సంపద ఎంత? ఇదే మౌలికాంశం. ఈ మౌలికాంశం పరిశీలిద్దాం. రైతులు కూలీలు పంటలు పండిస్తారు, కార్మికులు సంపద సృష్టిస్తారు. అసలు సకల సంపదల సృష్టికర్తలు వ్యవసాయం చేసే రైతులు, కూలీలు, కార్మికులు. పారిశ్రామిక వేత్తలు సైతం కార్మికుల సహకారంతో సంపద సృష్టిస్తారు. మరి మధ్య తరగతి ప్రజలు సమాజంలో ఏ సంపద సృష్టిస్తున్నారు?

## ఈవిఎం గోడౌన్‌లను పరిశీలించిన జిల్లా రెవెన్యూ అధికారి కే.మధుసూదన్ రావు



**కర్నూలు, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

ఈవిఎం గోడౌన్ లను జిల్లా రెవిన్యూ అధికారి కే మధుసూదన్ రావు పరిశీలించారు. జిల్లా రెవిన్యూ అధికారికే మధుసూదన్ రావు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టరేట్ లోని ఈవిఎం గోడౌన్ లను ప్రతి మూడు నెలలకు ఒక్కసారి పరిశీలించడం జరుగుతుందని అందులో భాగంగా శనివారం ఈవిఎం గోడౌన్ లను పరిశీలించడం జరిగిందని డిఆర్ఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ మురళి, ఎలక్షన్స్ సెల్ సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

## అంబడిపూడి మారుతికి గౌరవ డాక్టరేట్ ప్రధానం




**కర్నూలు, డిసెంబర్ 30(శ్రీచక్ర) :**

కర్నూల్ పట్టణం వాసి అంబడిపూడి మారుతికి అరుదైన గౌరవం దక్కింది. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు శనివారం తమిళనాడులోని హోసూర్ లో జరిగిన కార్యక్రమంలో లీగల్ అవేర్ నెస్ అండ్ సోసియల్ సర్వీస్ కు సంబందించి మారుతి చేసిన సేవలకుగాను ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడేమి బోర్డు అడ్వయిజర్ మాస్టర్ బాబువిజయన్, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే డా. మనోకరణ్, ఏపీ రిటైర్డ్ జడ్జి డా. హరిదాస్, క్రిష్ణగిరి ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ డా. జ్ఞాన శేఖర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా అంబడిపూడి మారుతీ మాట్లాడుతూ తాను సోసియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ లో కర్నూల్ జిల్లా మహిళా విభాగం చైర్పర్సన్ గా పని చేస్తు, తెలుగుదేశం పార్టీలో కర్నూల్ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలుగా కూడా ప్రజలకు ఎన్నో సేవలు అందించామన్నారు. తమ సంస్థ ద్వారా జిల్లాలో ఎంతోమందికి న్యాయ సహాయం అందిస్తూ, రాజ్యాంగం, చట్టాలను వాటి విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పిస్తూ, చైతన్యవంతం చేస్తున్నామని అన్నారు. అంతేకాకుండా ఎంతోమంది నిరుపేదలకు, నిరాశ్రాయులకు అనేక రకాలుగా అండగా ఉంటూ, సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం వల్లనే ఈరోజు ఈ గౌరవ డాక్టరేట్ రావడానికి కారణం అయిందన్నారు. తనకు ఇంతటి గొప్ప గుర్తింపు రావడానికి సహాయ సహకారాలు అందించిన మిత్రులకు, పెద్దలకు కృతజ్ఞతలు తెలియచేశారు.

## టిడిపి, జనసేన ప్రభుత్వం ఏర్పాటుకోసం జనసైనికులు కష్టపడాలి

- జనసేన ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేసిన టి.జి భరత్

**కర్నూలు, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**



జనసైనికులందరూ టిడిపి జనసేన ప్రభుత్వాన్ని తెచ్చుకునేందుకు కష్టపడి పనిచేయాలని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టి.జి భరత్ అన్నారు. శనివారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో జనసేన పార్టీ కర్నూలు నియోజకవర్గ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టి.జి భరత్ ముఖ్య అతిథిగా హాజరై జనసైనికులను ఉద్దేశించి మాట్లాడారు. జనసేన క్యాడర్ మొత్తం పవన్ కళ్యాణ్ మీద అభిమానం వల్ల భావోద్వేగంతో పనిచేస్తారన్నారు. ఏదైనా పని అనుకుంటే దాన్ని పూర్తి చేసేందుకు ఎంతవరకైనా పోరాడేందుకు జనసైనికులు సిద్ధంగా ఉంటారన్నారు. టిడిపి జనసేన ప్రభుత్వం వచ్చాక ప్రజలందరికీ మంచి పాలన అందుతుందని, ముఖ్యంగా యువత భవిష్యత్తుకు మంచి మార్గం దొరుకుతుందన్నారు. టిడిపి హయాంలో అనంతపురం జిల్లాలో ఏర్పాటైన కియా పరిశ్రమ వల్ల ఆ ప్రాంతం రూపురేఖలు మొత్తం మారిపోయాయని తెలిపారు. అందుకే కర్నూల్లో తనను గెలిపిస్తే తనకున్న నెట్ వర్క్‌తో వివిధ కంపెనీలు కర్నూల్లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని, ఉపాధి లేని వారందరికీ పని కల్పించి ఆదాయం వచ్చేలా చేస్తానని భరత్ తెలిపారు. ఈ విషయాలన్నీ యువత గ్రహించి ప్రజలకు వివరించి అర్థమయ్యేలా చెప్పాలన్నారు. పవన్ కళ్యాణ్ లాగే తాము కూడా ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లో ఉన్నామన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే వేస్తే ఐదేళ్లు తాను కష్టపడి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటనన్నారు. అనంతరం జనసేన అసెంబ్లీ ఇంచార్జి అర్షద్ మాట్లాడుతూ ప్రజాసేవకు పవన్ కళ్యాణ్ కంకణం కట్టుకున్నారన్నారు. టిడిపి జనసేన ప్రభుత్వం వచ్చాక ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. కర్నూల్లో టి.జి భరత్ గెలుపు కోసం అందరం సమిష్టిగా కష్టపడదామని పిలుపునిచ్చారు. అనంతరం యువతకు కండువాలు కప్పి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్య క్రమంలో టిడిపి కర్నూలు నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాసమూర్తి, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, జనసేన ఐ.టి విభాగం నేతలు లక్ష్మీకాంత రెడ్డి, అనిత, నాగరాజు, టిడిపి వీరశైవ లింగాయత్ సాధికార సమితి నేత శివరాజ్, టిడిపి, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేరాలు తగ్గుదల : ఎస్పీ

- సమష్టి కృషితో క్రైమ్ రేట్ తగ్గించగలిగాం
- 2023 క్రైమ్ రౌండ్ అప్ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి సిద్దార్థ్ కౌశల్



**కడప, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

వై.ఎస్.ఆర్ జిల్లాలో పోలీస్ శాఖ సమర్ధవంతంగా పనిచేయడం వల్లే 2023లో నేరాలు గణనీయంగా తగ్గాయని, పోలీసులు సమష్టిగా పనిచేయడం వలనే సాధ్యమైందని జిల్లా ఎస్.పి సిద్దార్థ్ కౌశల్ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 2023 లో జరిగిన రౌండప్ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసింగ్ లో వినూత్నమైన మార్పులు తీసుకురావడంతోనే ఇది సాధ్యమైనదని, మరింత ద్విగుణీకృత ఉత్సాహంతో 2024 లో మరింత మెరుగైన పోలీసింగ్‌తో ప్రజలకు ఉత్తమమైన సేవలు అందిస్తాం. గత సంవత్సరంతో పోల్చుకుంటే 2023లో అన్ని రకాలైన నేరాలు నియంత్రణలో గణనీయమైన మార్పు కనిపించింది. గతంలో నమోదైన కేసులతో పోల్చు 2022 లో 582 కేసులు నమోదు కాగా 526 మందిని ఆచూకీ కనుగొని తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఏడాది 562 కేసులు నమోదు కాగా 512 మంది ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. కోర్ట్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు తో ఫాస్ట్ ట్రాక్ కేసులపై పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కేసుల విచారణ త్వరితగతిన జరిగి సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి నేరస్థులకు శిక్ష పడేలా కృషి చేస్తున్నారు. మొత్తం 550 కేసులను ఫాస్ట్ ట్రాక్ కేసులు గా గుర్తించగా అందులో 68 కేసుల్లో నేరస్థులకు సంబంధిత కోర్టులు శిక్ష విధించాయి. కేసుల్లో నేరారోపణలు రుజువు చేసి 57 శాతం కన్విక్షన్ రేట్ సాధించడం జరిగింది. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన తీవ్రమైన 11 కేసుల్లో ముద్దాయిలకు కోర్టులో సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి యావజ్జీవ కారాగార శిక్ష విధించేలా పోలీస్ అధికారులు సమష్టిగా కృషి చేశారు. దర్యాప్తులో ఉన్న కేసుల విచారణ వేగవంతంతో యు.ఐ కేసుల్లో భారీగా తగ్గుదల:ఈ ఏడాది నమోదైన కేసులతో పాటు ప్రారంభంలో ఉన్న కేసులు మొత్తం 8189 కేసులు ఉండగా, గణనీయంగా తగ్గించి ప్రస్తుతం వాటి సంఖ్య 1894 కేసులుగా ఉన్నాయి.

**లోక్ అదాలత్ :** 2022లో 14344 కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించగా, ఈ ఏడాది దాదాపు రెట్టింపు కేసులను అనగా 27,764 కేసులను పరిష్కరించారు.

# మద్యపానమును నిషేదించాలి

- టీడీపీ అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్



**కడప, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు ఇచ్చినమాట ప్రకారం మద్యపాన నిషేధం చేయాలని కడప జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మన్సూర్ అక్బర్ మాట్లాడుతూ మొదటగా మద్యపాన నిషేధం అని అధికారం వచ్చిన వెంటనే దశల వారిగా నిషేదిస్తాము అని యిప్పుడు చేయలేదని విమర్శించారు. మానవత్వం కనికరం లేని ప్రభుత్వం పేద ప్రజలు త్రాగే మద్యము ధరలు అమాంతం పెంచి వచ్చే ఆదాయంతో నవరత్నాలు నడిపిస్తున్నారని ఇది చాలా అన్యాయం అని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా 20సంవత్సరాల పాటు పేద ప్రజలు మద్యము త్రాగేలా లోన్ తెచ్చినరాని ఇది వాస్తవం కదా అని ప్రశ్నించారు. మాట తప్పినందుకు ప్రభుత్వం పైన ఉమ్మడి కడప జిల్లా వైసీపీ ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీ లు ఎంపీలు పోరాటం చేసి ప్రజల పక్షాన నిలువాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్ గారు 2024 మద్యపానము నిషేధం చేసి ఓట్లు అడుగుతానని చెప్పారని గుర్తు చేశారు.ఓట్లు అడగకుండా ఉండగలరా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ నాయకులు రూపనగుడి హుస్సేన్, బాబయ్య, దస్తగిరి, సంపత్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటంకం లేకుండా అన్నదానం కొనసాగిస్తా :చల్లా రాజగోపాల్ యాదవ్



**ప్రొద్దుటూరు, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

ప్రొద్దుటూరు పట్టణంలో పేదల ఆకలి తీర్చే బీసీ నాయకులు ప్రొద్దుటూరు కృష్ణాలయ కమిటీ చైర్మన్ షూటింగ్ బాల్ కడప జిల్లా అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. శనివారం సందర్భంగా స్థానిక మైదుకూరు రోడ్డులోని అన్వర్ హాల్ వద్ద దాదాపు 800 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన శక్తికొలది ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. పేదల ఆకలి తీర్చే అవకాశం తనకు అందించిన ఆ భగవంతునికి ధన్యవాదాలు తెలిపారు. ఎంతో కాలంగా కొనసాగే ఈ అన్నదాన కార్యక్రమం యాదా విధిగా కొనసాగుతుందన్నారు. పట్టణ వాసులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తమ పనులపై వచ్చే సామాన్య ప్రజలకు ఈ అన్నదానం అందుతోంది. ఈ కార్యక్రమం దిగ్విజయంగా జరుపుతున్నామని ఆయన వివరించారు. ఎందరికో ఆకలి తీర్చే ఈ కార్యక్రమానికి ఎలాంటి ఆటంకం లేదని ఆయన పేర్కొన్నారు. మేము చేస్తున్న ఈ కార్యక్రమం అయా ప్రాంతాల్లో ప్రజల మననలు పొందుతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, మూరబోయిన శ్రీనివాస్ యాదవ్, చింతల రాఘవేంద్ర యాదవ్, బీసీ సంక్షేమ సంఘం పట్టణ సెక్రటరీ రామచంద్రరాజు,, నాయి బ్రాహ్మణ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, సీతంపల్లి రమణ, బంగి శివ, టైలర్ ప్రసాద్, ఈశ్వర్ రెడ్డి, ఏసునాథ్ రెడ్డి, హరీష్, రామయ్య యాదవ్, గంగాధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగేళ్లుగా కనిపించని అభివృద్ధి





- టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

**కడప, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

వైసిపి అధికారంలో ఉన్నప్పటికీ గత నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్రంలో ఎక్కడ అభివృద్ధి జరగలేదనిఅని టిడిపి పాలిటబూర సభలు ఆర్ శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. నగరంలోని 4 వ డివిజన్, శాంతి నగర్ లో కడప నియోజకవర్గ ఇన్చార్జి రెడ్డప్ప గారి మాధవి ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం టిడిపి, జనసేన నాయకులు కలిసి నిర్వహించగ, స్థానిక మహిళలు రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు కాలేదని, మురుగునీరు రోడ్లపై చేరిన ఎవ్వరు పట్టించుకోవడంలేదని, ఎన్నికల ముందు వచ్చి, గెలిచి కనీసం త్రాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని శ్రీనివాసరెడ్డి, సుంకర శ్రీనివాస్ ఎదుట సమస్యలను వెళ్ళగక్కారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నమ్మి ప్రజలు ఓట్లు వేస్తే, గెలిచిన అంజాద్ భాష నాలుగున్నర ఏండ్ల కాలంలో ప్రజా సమస్యలు ఆయనకు పట్టలేదని చెప్పారు. నగర మేయర్ ప్రాతినిధ్యం వహించిన డివిజన్లోనే సమస్యలు పరిష్కారం కాకపోతే, ఇతర డివిజన్లో పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పకనే తెలుస్తుందన్నారు. ప్రజా సంక్షేమం ఈ ప్రభుత్వానికి పట్టలేదని, గెలిచిన ఎమ్మెల్యేకు ప్రజా సమస్యలు పరిష్కరించే తీరుబాటు లేదని, రోడ్డుపై నిలిచిన మురుగును చూపిస్తూ నిప్పులు చెరిగారు. అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకోవడం తప్ప, చేసింది ఏమీ లేదన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే దగ్గరుండి వసతులు సమకూరుస్తామని స్థానికులకు ఆయన హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లా జనసేన సమన్వయకర్త సుంకర శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఎన్నికల్లో టిడిపి, జన సేనలను గెలిపించాలని ఆయన కోరారు. కడప నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ రెడ్డప్ప గారి మాధవి మాట్లాడుతూ ఈ ప్రభుత్వ నిరంకుశ పాలనతో విసిగి, వేసారి ఉన్న ప్రజలు చంద్రబాబు పాలనను కోరుకుంటున్నారని చెప్పారు. అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే చంద్రబాబుకు పట్టం, కట్టక తప్పదన్నారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఆదరించి, గెలిపిస్తే సమస్యలు లేని నగరంగా తీర్చి దిద్దుతానని ఆమె మహిళలను కోరారు. ముందుగా డివిజన్లో కలియతిరిగి, బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేసి, మేనిఫెస్టో లబ్ధిని స్థానికులకు విడమరచి చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు శివ కొండారెడ్డి, మీనాక్షి, పార్వతి, సుధీర్, స్థానిక నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# 19వ రోజు అంగన్‌వాడీలు మోకాళ్లపై నిరసన





**ప్రొద్దుటూరు, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

అంగన్వాడీ వర్కర్లు శనివారం 19వ రోజు మోకాళ్ళపై కూర్చొని సమ్మె కొనసాగించారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ ఏఐటియుసి రాష్ట్ర నాయకులు మంజుల మాట్లాడుతూ అంగన్వాడీలు 19 రోజుల నుంచి ఆందోళన కొనసాగుతున్న ప్రభుత్వము వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైనది కాదని అన్నారు ఇప్పటికైనా వారు అడుగుతున్న న్యాయమైన కోరికలను వెంటనే పరిష్కరించాలని సుప్రీంకోర్టు ఆర్డర్ అనుకూలంగా 26000 వేతనాలు ఇవ్వాలని రిటర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు కల్పించాలని పేస్ యాప్ ను రద్దు చేయాలని నాణ్యమైన సరుకులు తల్లులకు ఇవ్వాలని కోరుతూ ఆందోళన కొనసాగుతున్నదని, అంగన్వాడీలకు మద్దతుగా సీఎం సురేష్ నాయుడుటెంట్ వద్దకు వచ్చి అంగన్వాడీలకు ఉద్యమ అవసరాల కొరకు లక్ష రూపాయలు అందజేశారు. ప్రతిరోజు భోజనాలు కూడా ఏర్పాటు చేస్తున్నారని, సమ్మె ముగిసే వరకు అండగా ఉంటామని తెలిపారు. బిజెపి నాయకులు న్యాయవాది గొర్రె శ్రీనివాసులు అంగన్వాడీలకు మద్దతు తెలిపారు. ఈ ఆందోళనలో కార్యదర్శి విజయ్ కుమార్ డివైఎఫ్ఐ నాయకులు దేవిడ్అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి రాజి గీత నిర్మల కృష్ణవేణి లక్ష్మీదేవి విజయ నాగలక్ష్మి అంగన్వాడి టీచర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 32వ వార్డులో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



**ప్రొద్దుటూరు, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

మున్సిపాలిటీ పరిధిలోని 32వ వార్డులో దాదాపు 5 లక్షల రూపాయలతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి శనివారం శాసనసభ్యులు రాచమల్లు శివప్రసాద్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి, ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షురాలు కోనేటి సునంద, పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# లాస్ ఏంజిల్స్ రాయలసీమ అసోసియేషన్ (నార్త్ అమెరికా) వారి సహకారంతో నిరుపేద దివ్యాంగురాలికి మోటర్ సైకిల్ వితరణ



**ప్రొద్దుటూరు, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో అమృత నగర్ కు చెందిన మాబు చాన్ అనే దివ్యాంగురాలికి నార్త్ అమెరికా నందు గల లాస్ ఏంజిల్స్ రాయలసీమ అసోసియేషన్ వారి సహకారంతో ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయం వద్ద ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ సలహాదారుడు సి.వి. సుబ్బారావు చేతుల మీదుగా 3చక్రాల మోటర్ బైక్ ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ తన చిన్ననాటి మిత్రురాలు పూజ ఆమె భర్త రాము, మరియు లాస్ ఏంజిల్స్ రాయలసీమ అసోసియేషన్ వారి సహకారంతో లక్ష యాబై వేల రూపాయలు విలువ చేసే మూడు చక్రాల వాహనం అందజేయడం సంతోషం అని అందుకు సహకరించిన పూజా రాము.కు అలాగే లాస్ ఏంజిల్స్ లోని రాయలసీమ అసోసియేషన్ వారికి ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ తరపున హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేయడం జరిగినది. అలాగే సంస్థ సలహాదారుడు సి.వి.సుబ్బారావు మాట్లాడుతూ దివ్యాంగురాలని బాధపడకుండా ఇతరులతో పోటీపడుతూ ముందుకు సాగి ఉన్నతమైన శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థలోని కార్యదర్శి మాధవ, సహాయ కార్యదర్శి సాయి, అమరావతి శ్రీకాంత్, సుధాకర్ రెడ్డి, ఉప్పు మల్లికార్జున, శేఖర్, విజయ, మీకోసం సేవా సంస్థ అధ్యక్షుడు పుళ్లగూర విష్ణు వర్ధన్, ప్రసన్న ఆంధ్రా వీక్లీ పత్రిక ఎండి %డ% సీ ఈ ఓ బొలిశెట్టి రెడ్డి ప్రసన్న పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన




**ప్రొద్దుటూరు, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె 5వరోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు నల్ల చొక్కాలు, నల్ల చీరలు, నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని నిరసన తెలిపారు. మున్సిపల్ కార్మికుల అందరు కూడా విధులు బహిష్కరించి పొద్దుటూరు మున్సిపల్ ఆఫీస్ వద్ద సమ్మె చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి, సాల్మన్ మాట్లాడుతూ జగనన్న ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఆప్కాస్ రద్దు చేసి, సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, నేటి ధరలకు అనుకూలంగా కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, రిటర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షలు రూపాయలు ఇవ్వాలని, ప్రతినెల 5000 రూపాయలు పింఛన్ ఇవ్వాలని, జీవో నెంబర్ సెవెన్ ప్రకారం క్యాబ్ డ్రైవర్లకు 18500 జీతం ఇవ్వాలని, ఆరు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కరోనాల తీసుకున్న కార్మికులకు ఆప్కాసులో కలపాలని, వారికి వేతనాలు పెంచాలని, చనిపోయిన కార్మికుల స్థానంలో తొందరగా ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ ధర్నాలో యూనియన్ పట్టణ అధ్యక్షులు చంటి, పట్టణ కోశాధికారి రాఘవేంద్ర, ప్రమీలమ్మ, గురమ్మ, రమాదేవి, నీతమ్మ, శాంతి, మరియమ్మ, నరసమ్మ, అన్నపూర్ణ, మోహన్, ఓబయ్య, సురేష్, జాకోబు, సుధాకర్, లంకా రవి, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆత్మకూరుకే ఆనం యుద్ధానికి సిద్ధం ఉంటున్న అనుచరులు

- జనవరి 3న అధికారికంగా ప్రకటన చేయవచ్చు ?

**సంగం, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

ఆత్మకూరు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ఎదురుచూస్తున్న తరుణంలో కొత్త సంవత్సరములో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా వెంకటగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే మాజీ మంత్రివర్యులు ఆనం నారాయణరెడ్డి. పోటీలోకి దిగతారని ఆయన అనుచరుల ద్వారా సమాచారం అందింది. ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీలు అధికారకంగా ప్రకటించనటువంటి ఈ విషయం జనవరి మూడో తేదీ పార్టీలో చేరుతారని ఆరోజే నియోజకవర్గంలో పోటీ చేసే విషయాన్ని కూడా బయట పెడతారని సమాచారం తెలుస్తుంది. ఈ విషయంలో ఊహాగానులకు స్థిరపడనున్నట్లు ఆయన అనుచరులు తెలుపుతున్నారు. కొత్త సంవత్సరంలో ఆయన ఎన్నికల ప్రచారం కూడా మొదలుపెట్టవచ్చునని అంటున్నారు. 2024 సంవత్సరములో జరిగే ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని ఆత్మకూరు నియోజకవర్గం ఎన్నికల పోటీ సంచలనం సృష్టిస్తుంది. ఇప్పటివరకు శాసనసభ్యుడుగా మేకపాటి విక్రమ్ రెడ్డి రెండు దపాలుగా విజయం సాధించి సంచలనం సృష్టించి ఉన్నారు. మూడో పర్యాయం కూడా విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మనం రామ్ నారాయణ రెడ్డి ఈ నియోజకవర్గంలో బంధుత్వాలు ఎక్కువగా ఉన్నాయి ఆయనకు. నియోజకవర్గంలోని ఆత్మకూరు పట్టణం కి వస్తే నియోజకవర్గ అభివృద్ధి పనులు చేయించడంలో ఆయన తర్వాత ఎవరు అంత మాత్రం చేయించలేదని స్థానిక ప్రజలు చెబుతున్నారు. గతంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో ఆర్థిక



శాఖ మంత్రిగా కొనసాగిన సమయంలో ఈ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు అభివృద్ధి పనులు చేయడం జరిగింది. రాష్ట్రం విడిపోయిన అనంతరం ఈ నియోజకవర్గంలో ఆయన ఓటమి కాదు కావడం జరిగింది. ఈ నియోజకవర్గంలో ఆరు మండలాలకు సంబంధించి నాయకత్వం ఎక్కువగా ఆయనకు సంబంధాలు ఉన్నాయని చెప్పవచ్చును. విక్రమ్ రెడ్డికి మాత్రం ఎమ్మెల్యేగా ఆయన పార్టీకి సంబంధించిన కొంతమంది నాయకులను పక్కనపెట్టి ఉన్నారని సమాచారం తెలుస్తుంది. మరలా ఎన్నికల సమయానికి ఆయన వాళ్లని కలుపుకుంటే తప్ప వాళ్ళు పక్క పార్టీకి పోతే మాత్రం ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డికి షాక్ అనే చెప్పవచ్చును.

## 3 నుంచి మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె




- బైక్ ర్యాలీ నిర్వహించిన మున్సిపల్ వర్కర్స్

**కనిగిరి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

జనవరి 3 నుంచి మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్ అన్నారు. శనివారం కనిగిరి గార్లపేట రోడ్డులోని దర్శి చెంచయ్య భవన్ నుంచి పామూరు బస్టాండ్, ఒంగోలు బస్టాండ్ వరకు కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈనెల 28వ తేదీ పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తో కార్మిక సంఘాలు చర్చలు జరిపిన స్పష్టత రాలేదని, ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసేంతవరకు ప్రతిరోజు నిరసన తెలుపుతూ జనవరి 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె జరుగుతుందన్నారు. ప్రభుత్వం 12వ పి అర్ సి లో వేతనాలు పెంచుతామని, సెలవుల డబ్బులు ఇస్తామని, పెండింగ్ డిఏలు ఇంక్రిమెంట్లు కార్మికుల కార్మికుల ఖాతాలో వేయిస్తామని, పిఎఫ్, ఈఎస్ఐ లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ఆ హామీలను కార్మికులు నమ్మే పరిస్థితి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా చూస్తాం చేస్తామంటూ కాలయాపన చేస్తుందని మంత్రి ఇచ్చిన హామీలను నిర్దిష్టమైన సర్కుల రూపంలో ఇవ్వాలని లేని పక్షంలో జనవరి 3వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కనిగిరి నియోజకవర్గం అధ్యక్షుడు గుజ్జుల బాలిరెడ్డి, కనిగిరి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కోటయ్య, సిహెచ్ అశోక్, నాసర్, కిరణ్, మస్తాన్, రత్తయ్య, ఖాసింవలి, సుబ్రహ్మణ్యం, శేషయ్య, మధు, ఐజాక్ ,సామేలు , తాజుద్దీన్, జీవన్, రవి, ప్రసాద్, చంద్ర, అంజి, మాలకొండయ్య, దానియేలు, పౌలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీవై అభ్యర్థిగా యువ కెరటం

- ముందు రేసులో ఉన్న తిపిరిబోయిన రమేష్ యాదవ్

**ఉదయగిరి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**



ఉదయగిరి నియోజకవర్గ భారత చైతన్య యువజన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా స్థానికులు విద్యావంతులు ముఖ్యంగా యువతకు ఇవ్వాలని పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ మదిలో ఉన్నట్లు సమాచారం. ఆ నేపథ్యంలో నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న స్థానిక యువ నాయకుడు ఉద్యా రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షులు తిపిరిబోయిన రమేష్ యాదవ్ ఎంతో మంది యువతకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ తన వంతు పాత్ర పోషిస్తూ నియోజకవర్గ యువతకు అన్ని రకాలుగా అండగా ఉంటూ ముందుకు వెళ్తున్న దుత్తలూరు మండలానికి చెందిన వెంగన పాలెం గ్రామానికి చెందిన తిపిరి బోయిన రమేష్ యాదవ్ కు ప్రజా సమస్యలపై స్థానికంగా పోరాటం చేస్తూ గ్రామ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించడమే కాకుండా మండలంలోను నియోజకవర్గంలోనూ ప్రజలతో సత్సంబంధాలు కలిగిన నేపథ్యంలో అధిష్టానం ముందు రేసులో ఆయన ఉన్నట్లు నియోజకవర్గంలో చర్చలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ ను వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ బీసీవై జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న యువతకు ప్రాధాన్యం కల్పిస్తూ రాబోవు ఎన్నికల బరిలో నిలిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా నియోజకవర్గంలో యాదవ్ భవన్ నిర్మాణానికి కృషి చేస్తూ అలాగే నియోజకవర్గంలోని యాదవ సోదరులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ వివిధ సేవా కార్యక్రమాలు, మెడికల్ క్యాంపులు , అనారోగ్య బాధితులకు తన వంతు సహాయం అందిస్తూ ప్రజా సేవలో ఉంటూ స్థానికుడిగా నియోజకవర్గ ప్రజా సమస్యలను అవగాహన ఉన్న నేపథ్యంలో అధిష్టానం తనను గుర్తించే అవకాశం ఉందని అన్నారు. ముఖ్యంగా బోడే రామచంద్ర యాదవ్ ఆశయాలను, ఆలోచనలను, ఆకర్షితుడై బీసీవై పార్టీలో చేరినట్లు తెలిపారు. అధిష్టానం తనకు అవకాశం కల్పిస్తే వెనుకబడిన ప్రాంతమైన ఉదయగిరి ప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

## డిమాండ్లు పరిష్కరించకపోతే ఆకులు తిని బతకాల్సిందే

- వినూత్నంగా నిరసన తెలిపిన అంగన్వాడీ కార్యకర్తలు



**ఉదయగిరి/వరికుంటపాడు, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

వరికుంటపాడు మండలంలోని మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడిలు గత కొన్ని రోజులుగా నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. శనివారం నాడు 19 వ రోజు సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల కనీస వేతనం 26 వేలు ఇవ్వలేకపోతే తాము ఆకులు తిని బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని అందువలన ప్రభుత్వం వెంటనే అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్ చేశారు. అలాగే తమ డిమాండ్లు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వం అంగన్వాడీల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని గతంలో ఏ ప్రభుత్వం ఇటువంటి వైఖరి అవలంబించలేదని వారు అన్నారు. అంగన్వాడీ కుటుంబాలు చాలీచాలని జీతాలతో, పెరుగుతున్న ధరలతో పోటీ పడలేక అప్పుల పాలవుతున్నారని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలలో భారీ అవినీతి

- నాసిరకం మెటీరియల్‌తో నిర్మాణం
- పేదలను మోసం చేస్తున్న వైసీపీ ప్రభుత్వం
- ప్రశ్నిస్తే దాడులు అక్రమ అరెస్టులు
- మాజీ శాసన సభ్యులు బొల్లినేని వెంకట రామారావు



**ఉదయగిరి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

ఉదయగిరి నియోజకవర్గం ఉదయగిరి మండలంలో ప్రజా దీవెన యాత్ర లో భాగంగా బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలు పరిశీలించగా నాసిరకంగా నిర్మిస్తూ వైసీపీ నేతలు భారీ అవినీతికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే ,నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బొల్లినేని వెంకట రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నాడు ఆయన కొండాయపాలెం పంచాయతీలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలను సందర్శించారు. అక్కడ వేసిన బేస్మెంట్లను పరిశీలించారు. నాసిరకం మెటీరియల్, ఇసుకతో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్టు ఆయన గుర్తించారు. పేదలకు నాణ్యమైన ఇళ్లను నిర్మించి ఇచ్చే వరకు తాము పోరాడుతామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో తాను శాసన సభ్యునిగా ఉండి నియోజకవర్గంలో 4500 పైగా ఇళ్లను నిర్మించామన్నారు. ఈ ప్రభుత్వంలో ఇప్పటికీ ఒక్క ఇంటిని కూడా నిర్మించి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. పేదల ఇళ్లకు వస్తున్న ఇసుక కంకర సిమెంట్ స్థానిక వైసీపీ నేతలు స్వాహా చేస్తున్నారని ఆయన తెలిపారు. జగనన్న కాలనీలను క్వాలిటీ కంట్రోల్ వారు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వీరి అవినీతిని బయట పెడితే దాడులు చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకట్ రెడ్డి,మండల కన్వీనర్ బయన్న, క్లస్టర్ ఇంచార్జ్ రియాజ్, మాజీ హాస్పిటల్ చైర్మన్ బొజ్జ నరసింహులు, పలువురు మండల నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని అడ్డుకున్న పోలీసులు

- లా అండ్ ప్రాబ్లం అంటూ పోలీసుల ఓవరాక్షన్
- అక్రమ కేసులను ఎత్తి వేయాలంటూ బొల్లినేని డిమాండ్
- వైసీపీ పతనం తొందరలోనే బొల్లినేని వెంకట రామారావు



**ఉదయగిరి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

ఉదయగిరి పట్టణంలో 3వ రోజు జరుగుతున్న బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. నిన్న ప్రభుత్వ సిమెంట్ అక్రమ నిల్వలను రెడ్ హ్యాండెడ్ గా మాజీ శాసన సభ్యులు బొల్లినేని వెంకట రామారావు పట్టుకోవడంతో వైసీపీ నేతల టిడిపి నేతల మధ్య వాగ్వివాదం జరిగింది. వైసీపీ నేతలు పోలీసులను అడ్డం పెట్టుకుని లా అండ్ ఆర్డర్ ప్రాబ్లం పేరుతో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ పథకాలు ప్రజల్లోకి వెళ్లకుండా ఆపాలని పోలీసుల పై ఒత్తిడి తెచ్చారు అందుకే పోలీసులు ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయాలంటూ బొల్లినేని వెంకట రామారావు ను అడ్డుకున్నారు. ప్రశాంతంగా జరుగుతున్న కార్యక్రమాన్ని ఎందుకు వాయిదా వేయాలంటూ బొల్లినేని వారిని ప్రశ్నించారు. ప్రభుత్వ సిమెంటును ప్రభుత్వ అధికారులు వాడుకోవడమే కాక ప్రశ్నించిన మా వారిపై అక్రమ అట్రాసిటీ కేసులు బనాయించి కార్యక్రమాన్ని అడ్డుకోవడం బాగాలేదన్నారు. మా పార్టీ వాళ్లు కేసులు ఇస్తే కట్టకుండా వారిని వేధిస్తున్నారన్నారు అని మండిపడ్డారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని అధికారులు ప్రజల పక్షాన నిలబడాలని లేకపోతే అధికారులు ఇబ్బంది పడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నారాయణస్వామిని దర్శించుకున్న దారపనేని



**కనిగిరి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

ప్రకాశం జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం సిఎస్ పురం మండలం శ్రీశ్రీశ్రీ మిట్ట పాలెం నారాయణస్వామి వారిని శనివారము, సంకటహర చతుర్థి సందర్భాన్ని పురస్కరించుకొని కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనం సకల భోగభాగ్యాలకు నిలయమని, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తులకు అపారమైన నమ్మకం అని, ఉభయ తెలుగు రాష్ట్రాలలో నారాయణస్వామి వారి పేరు మీద వాణిజ్య రంగంలో ఎన్నో వ్యాపారాలు నిర్వహిస్తు, దిగ్విజయంగా కొనసాగుతున్నారని, స్వామి వారిని దర్శించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని దారపనేని పేర్కొన్నారు. పోతిరెడ్డి తిరుపతిరెడ్డి, దారపనేని నరసింహ నాయుడు, మట్లె రాహుల్ యాదవ్, జాజం హరికృష్ణ నారాయణ స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

## సిఎస్ పురంలో ఆడదాం ఆంధ్ర యువతకు మంచి అవకాశం-సింగంపల్లి




**కనిగిరి, డిసెంబర్ 30(శ్రీచక్ర) :**

ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీ కార్యక్రమం యువతకు మంచి అవకాశం అని చంద్రశేఖరాపురం పంచాయతీ సెక్రటరీ సింగంపల్లి రాంప్రసాద్ అన్నారు చంద్రశేఖరపురం మండల కేంద్రంలోని హైస్కూల్లో కోకో కబాడీ గేమ్లను ఆడించారు పంచాయతీ సెక్రెటరీ సింగంపల్లి రాంప్రసాద్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమానికి క్రీడాకారులు పాల్గొన్నారు యువత ఆటలతో ముందుకు సాగుతూ రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చే విధంగా యువకులందరూ కృషి చేయాలని వైసిపి నాయకులు ఆకాంక్షించారు పంచాయతీ సెక్రటరీ సింగంపల్లి రాంప్రసాద్, సర్పంచ్ శ్రీరామ పద్మావతి, మండల ప్రత్యేక అధికారి విద్యాసాగర్ రావు, ఎంపీడీవో పూర్ణచంద్రరావు, ఎంఈఓ ప్రసాద్, వైసీపీ మండల కన్వీనర్ బోయల తిరుపతిరెడ్డి, భువనగిరి వెంకటయ్య, వైసీపీ నాయకులు జై రెడ్డి యూత్ అధ్యక్షులు రమణయ్య, ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య సచివాలయ కన్వీనర్ పాలకొల్లు వెంకటేశ్వర్లు రెడ్డి, సచివాలయం పీఈటీలు నాగేశ్వరరావు, రఫియా, రమేష్ బాబు, సచివాలయ సిబ్బంది మరియు వాలంటరీలు పాల్గొన్నారు.

# సీఎం ఆదేశాల మేరకు రానున్న ఎన్నికల్లో వెంకటగిరి నియోజకవర్గం నుండి పోటీ చేసేది నేనే - నేదురుమల్లి

**వెంకటగిరి, డిసెంబర్ 31 (శ్రీచక్ర) :**

సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు 2024 ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి వెంకటగిరి నియోజకవర్గ అభ్యర్థిగా ఎన్నికల బరిలో తాను నిలవానున్నట్లు వైయస్సార్సీపి తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. వెంకటగిరి లోని హనుమాన్ నగర్ లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి బలోపేతానికి దిశగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి గత ఏడాది క్రితం వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడం జరిగిందన్నారు. అప్పటినుండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులను కార్యకర్తల సమన్వయంతో ముందుకు తీసుకెళుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్టానం నిర్ణయం తీసుకుందని త్వరలో అధికార పూరకంగా విడుదల కానున్నట్లు తెలిపారు. అంతేకాకుండా నేతన్న నేస్తం నిధులు విడుదల సమయంలో వెంకటగిరి కి విచ్చేసిన సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సభ విజయవంతం రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న బస్సు యాత్ర వచ్చే సంవత్సరం జనవరి 5వ తేదీన వెంకటగిరి నియోజకవర్గం నుండి ప్రారంభమై డక్కిలి, రాపూరు మండలాల మీదుగా యాత్ర కొనసాగి రాపూర్ లో బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ప్రతి వైఎస్ఆర్సిపి కార్యకర్తలు నాయకులు సమిష్టిగా కృషిచేసి సీఎం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్ఆర్సిపి నాయకులు అందరిని సమన్వయంతో ముందుకు తీసుకెళు తున్నామని నేదురుమల్లి ఎప్పుడు ఆహ్వానం పలుకుతానని తెలిపారు. వైఎస్ఆర్సిపి కార్యకర్తలు నాయకులు ఎవరైనా ఎప్పుడైనా తనను కలుసుకోవచ్చునని పిలుపునిచ్చారు..



## కృష్ణమనాయుడు కుంట చరిత్రను వ్రాయించండి - కమిషనర్ హరిత



**తిరుపతి, డిసెంబర్ 31 (శ్రీచక్ర) :**

తిరుపతి చెన్నారెడ్డి కాలనీలో ఆధునికరిస్తున్న కృష్ణమనాయుడు కుంట యొక్క చరిత్రను ప్రజలకు తెలిసేలా బోర్డుపై వ్రాయించి ఏర్పాటు చేయించాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేసారు. కృష్ణమనాయుడు కుంట పనులను శనివారం కమిషనర్ హరిత పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెన్నారెడ్డి కాలనీలో పూరతనమైన కృష్ణమనాయుడు కుంట దాదాపు పూర్తిగా శిధిలావస్థకు చేరుకోవడం జరిగిందని, ప్రజల విజ్ఞప్తి మేరకు కృష్ణమనాయుడు కుంట ప్రాధాన్యత మేరకు ఆధునికరించడం జరుగుతున్నదన్నారు. 1 కోటి 38 లక్షలతో పనులను చేపట్టడం జరిగిందన్నారు. ఆధునికీకరణ పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. మునిసిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డికి ఆదేశాలు జారీ చేస్తూ కుంటలోని నీరు శుభ్రతగా వుంచాలని, ప్రహరి గోడలపై ఆధ్యాత్మిక చిత్రాలను గీయించాలని, కుంట పైన లోపలి వైపు గ్రీనరీని పెంచాలని, అనువైన చోట్ల ప్రజలు సేద తీరిందేకు అనువైన బెంచీలను ఏర్పాటు చేయించాలని, టైల్స్ చక్కగా ఏర్పాటు చేయించాలన్నారు. ఆధునికరిస్తున్న కృష్ణమనాయుడు కుంట ప్రజలకు ఓక మంచి ఆహ్లాదకరమైన, ఆధ్యాత్మిక ప్రదేశంగా తీర్చిదిద్దాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత సూచించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఈ విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## క్రీడాకారులంతా ఉత్సాహంగా పాల్గొనాలి



**బాలాయపల్లి, డిసెంబర్ 31 (శ్రీచక్ర) :**

క్రీడాకారులంతా ఉత్సాహంగా పాల్గొనాలని మం డల వైఎస్ఆర్సీపీ కన్వీనర్,జయంపు సహకార సంఘం అధ్యక్షుడు వెందోటి.కార్తీక్ రెడ్డి పేర్కొన్నా రు.శనివారం జయంపు లో ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు క్రికెట్ పోటీ లను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈ క్రీడా సంబరాలు దేశ చరిత్రలోనే మైలు రాయిగా ఉంటాయన్నారు. ఇది అందరూ పాల్గొనే గొప్ప పండుగన్నారు.ఊరూరా పండుగ వాతావరణంలో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు.ఈ కార్యక్రమం ప్రతి ఊర్లోనూ వ్యాయమం అని చెప్పారు. స్పోర్ట్స్ వల్ల ప్రతి మనిషి ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. మన క్రీడాకారులను పరిచయం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచి క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతగా పౌష్టికాహారం పంపిణీ చేద్దాం : సూపర్ వైజర్



**బాలాయపల్లి, డిసెంబర్ 31 (శ్రీచక్ర) :**

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భవతులు,బాలిం తలకు బాధితుగా పౌష్టికాహారం పంపిణీ చేయాల్సిన బాధ్యత సచివాలయం సిబ్బంది కలిసి బాధ్యతగా పంపిణీ చేయాలని సూపర్ వైజర్ రాజేశ్వరి పేర్కొన్నారు. శనివారం మండలంలోని గుటికల్ పాకపొడి గ్రామాల్లో ఉన్న అంగన వాడి కేంద్ర పరిధిలో ఉన్న బాలింతలకు గర్భవతులకు పోషకాహారం పంపిణీ కార్యక్రమంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాల సిబ్బంది సహకారంతో మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందజేస్తున్నా మని తెలియజేశారు. అంతేకాకుండా పాఠశాల ఉపాధ్యాయులు సహకరిస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

**వెంకటగిరి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**



వెంకటగిరి పట్టణంలోని ఆర్టీసీ బ స్టాండ్ వద్ద సబ్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో నవీన్ కుమార్ మురుగేషన్ నిర్మల్ కుమార్ లు అనుమానాస్పదంగా కనపడడంతో విచారించగా వారి వద్ద నుంచి ఆరు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని స్పెషల్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవీన్ కుమార్ మురుగేషన్ నిర్మల్ కుమార్ లు చెన్నై లో ఉంటున్నారని విచారంచగా వివరాలు తెలిపారు వీరితోపాటు సంబంధం ఉన్న సుమన్ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్టు వివరించారు వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలిస్తున్నట్టు వివరించారు ఈ కార్యక్రమంలో గూడూరు డివిజనల్ స్పెషల్ స్టోర్స్ ఎస్సై విజయ్ కుమార్ కానిస్టేబుల్లో పుట్టయ్య పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గొబ్బెమ్మ ఉత్సవం



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

దక్షిణ కైలాసంగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం నందు ధనుర్మాసం సందర్భంగా గొబ్బెమ్మ ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించిన అనంతరం అమ్మవారు నాలుగు పురవీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కరుణాకరన్ గురుకుల్, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరి యాదవ్ మరియు ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అంబటిని కలిసిన రేణిగుంట మండలం ఇన్‌చార్జ్ పవిత్రారెడ్డి



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

గతకొద్ది రోజులుగా రేణిగుంట మండలం నందు నీటికొరత ఏర్పడడంతో రేణిగుంట మండల ఇంచార్జ్ శ్రీపవిత్ర రెడ్డి పలుమార్లు అధికారులను కలిసి మండలంలోని ప్రజలకు నీటి కొరత లేకుండా కార్యాచరణ చేయాలంటూ విజ్ఞప్తి చేశారు. అయితే తెలుగుగంగా కాలువ నుంచి వచ్చే నీరు లేకపోవడంతో మండలంలోని ప్రజలకు కొద్దిపాటి నీటి కొరత ఏర్పడింది ,అయితే దీనిపై నేడు ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి ఆదేశాలు మేరకు పవిత్రరెడ్డి రేణిగుంట విమానాశ్రయం నందు నీటిపారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబు ని కలిసి, రేణిగుంట ప్రజల నీటి కష్టాలను వివరించారు, పవిత్ర రెడ్డి వినతిని మంత్రి సానుకూలంగా స్పందించి, రెండు రోజుల్లో నీటి సమస్యను పరిష్కరిస్తానని పవిత్ర రెడ్డి కి హామీ ఇచ్చారు. పవిత్రరెడ్డి మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాలుగా రేణిగుంట మండల ప్రజలకు ఏటువంటి సమస్య లేకుండా నీటిని అందించాము ఎక్కడ ఎటువంటి కష్టం వచ్చిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వెంటనే ఆ సమస్యను పరిష్కరించేవిదంగా కార్యాచరణ చేపడుతున్నారని అయితే తెలుగుగంగకాలువలో నీరు లేకపోవడంతో గత కొద్దిరోజులుగా రేణిగుంట మండలంలో నీటి కొరత ఏర్పడిందని, దీనిని ప్రతిపక్ష నాయకులు భూతద్దంలో చూపించే విధంగా వారి రాజకీయ స్వలాభాల కోసం ప్రచారాలు చేసుకుంటున్నారని, సమస్యను పరిష్కరించే వారే నాయకుడని, సమస్యలను రాజకీయం చేసేవారు నాయకులు కాలేరని, వారిని ఎప్పుడు ప్రజలు వారి స్థానంలోనే ఉంచుతారని, సేవ చేసే నాయకుడికే ప్రజల మన్నలు ఎప్పుడూ ఉంటాయని, ఇకనైనా ప్రజల సమస్యలను రాజకీయాలు చేయకుండా, ప్రజలకు మేలు చేకూర్చే విధంగా ప్రతి ఒక్కరు ప్రజాసేవ చేయాలని, ఆమె ప్రతిపక్ష నాయకులు హితువు పలికారు, మరో నాలుగు రోజుల్లో రేణిగుంట మండల ప్రజలకు పుష్కలంగా నీరు దొరికే విధంగా కార్యాచరణ చేపట్టామని, నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబుతో రేణిగుంట మండలోని ప్రజల నీటిసమస్య గురించి తెలియజేశామని, పై సమస్యపై మంత్రి సానుకూలంగా స్పందించి మరో రెండు రోజుల్లో నీటి సమస్యను పరిష్కరించే విధంగా కార్యాచరణ చేపడతామని తెలియజేశారని,త్వరలో రేణిగుంట మండల ప్రజలకు నీటి సమస్యను పరిష్కరిస్తామని, ఇప్పుడు నీటి సమస్యను, వారి రాజకీయ స్వలాభాల కోసం అసత్యపు ప్రచారాలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులు నీటి సమస్య తీరిన తర్వాత ఏ విధంగా వాటిని ప్రచారం చేస్తారో చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నగేష్,పట్టణ అధ్యక్షులు ప్రభాకర్,తిరుపతి జిల్లా మైనారిటీ అధ్యక్షులు రసూల్ పాల్గొన్నారు.

## పలు దుకాణాలపై తూనికలు కొలతల శాఖ దాడులు






**గూడూరు రూరల్, డిసెంబర్ 30(శ్రీచక్ర) :**

గూడూరు పట్టణ మరియు పలు పరిసర ప్రాంతాలలో దాడులు నిర్విించినట్లు తూనికలు కొలతల శాఖ అధికారి కె.మల్లేశ్వరరావ్ తెలిపారు. ఈ దాడులలో బాగంగా కాటాలకు సమందించి లైసెన్స్ లేని పలు దుకాన దారులకు ఫైన్ లు వేశారు కొన్ని కటాలు సీజ్ చేసినట్లు తెలియజేశారు.

## బీసీ హాస్టల్లో తనిఖీలు



**కోట, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

కోట మండలంలోని స్థానిక ఎమ్ ఈ ఓ కార్యాలయం సమీపంలో ఉన్న బీసీ బాలురు హాస్టల్,బీసీ బాలికల హాస్టల్ లను తిరుపతి జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి బి.భాస్కర్ రెడ్డి,గూడూరు డివిజన్ బీసీ వెల్ఫేర్ అధికారి జే. వెంకటేశ్వర్లు లు ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా శనివారం కోట మండలంలోని పలు బీసీ హాస్టల్ విద్యార్థులును పలు ప్రశ్నలు అడిగి వారి యొక్క విద్యా స్థితిగతులుపై ఆరా తీశారు.అదేవిధంగా హాస్టల్ లోని పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అంతేకాకుండా పిల్లలకు అందించే మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు.స్టోర్ రూమ్ లో ఉండే ప్రొవిజన్స్ ను పరిశీలించారు. అనంతరం జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి భాస్కర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి కష్టపడి చదివి మంచి మార్కులు పొందాలన్నారు. అంతేకాకుండా జిల్లా స్థాయిలో బీసీ హాస్టల్ లో 24 వార్డెన్ పోస్టులు,34 వర్కర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు డివిజన్ బీసీ వెల్ఫేర్ అధికారి జే.వెంకటేశ్వర్లు, ఎస్సీ హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు,హాస్టల్ సిబ్బంది ఉన్నారు.

## వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా శివనాథపురంలోని అమ్మ అనాథ మహిళ వృద్ధాశ్రమం నందు న్యాయవి జ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో వృద్ధులకు సంబంధించి వారికి రావలసిన బెనిఫిట్స్ గురించి ఉచిత న్యాయ సలహాలు, చట్టం వారికి ఏ విధంగా ఉపయోగపడుతుంది అనే విషయాలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గరికపాటి రమేష్ బాబు గుమ్మల్ల రాజేశ్వరరావు శ్రీరామ్ మరియు అమ్మ అనాథ మహిళ వృద్ధాశ్రమం వ్యవస్థాపకురాలు భూలక్ష్మి పాల్గొనడం జరిగింది.



# శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలకు అంకురార్పణ

**చంద్రగిరి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

చంద్రగిరి పట్టణంలో వెలసిన సత్యదేవత శ్రీ మూలాస్థాన ఎల్లమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించటానికి శుక్రవారం అంకురార్పణ జరిగింది. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి తిమ్మారెడ్డి ల ఆధ్వర్యంలో ప్రధాన పూజారి సూరి స్వామి నేతృత్వంలో పూజారులు ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించారు. జనవరి 14 నుండి ఉత్సవాలు ప్రారంభమై 18వ తేదీ వరకు ఐదు రోజులు నిర్వహించనున్న ఈ సంక్రాంతి ఉత్సవాలు కు ఎలాంటి అవరోధాలు జరగకుండా ఉండేలా పూజారులు పాలు పసుపు పంచితం కొబ్బరినీళ్ళతో ధ్వజస్తంభాన్ని శుద్ధిచేసి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. రాత్రి ధ్వజస్తంభంపై దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదాలను వితరణ చేసి సంక్రాంతి ఉత్సవాల చాటింపును ప్రారంభించారు. ఆలయ పునఃనిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో 2024 వ సంవత్సరంలో అమ్మవారి ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలు ఉంటాయా లేదా అన్న ప్రజల సందేహాలను శుక్రవారం ఆలయ చైర్మన్, కార్యనిర్వాహణాధికారి నివృత్తి చేశారు. ఐదు రోజులు నిర్వహించే ఈ సంక్రాంతి ఉత్సవాలలో ప్రతిరోజు అమ్మవారు ఊరేగింపు ఉంటుందని జనవరి 16న రథోత్సవం కార్యక్రమం, జనవరి 17న అంగరంగ వైభవంగా కొండ చుట్టు తిరణాలు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్, కార్యనిర్వాహణ అధికారి తెలిపారు. అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు సరవేగంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.



## ఆదివారం కూడా వడ్డీ లేకుండా ఆస్తి పన్ను చెల్లించవచ్చు - కమిషనర్ హరిత

**తిరుపతి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**



2023-24 రెండో అర్ధ సంవత్సరానికి వడ్డీ లేకుండా పన్ను చెల్లింపుకి నేడు 31 వ తేది ఆదివారం చివరి రోజు అని, నేడు కూడా కౌంటర్లు పని చేస్తాయని, ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా పన్ను చెల్లించడానికి నాలుగు ప్రత్యేక క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామని కమిషనర్ తెలిపారు. అలాగే డిసెంబర్ 31 ఆదివారం చివరి రోజు కనుక సెలవు రోజు అయినప్పటికీ క్యాష్ కౌంటర్లు యధావిధిగా పని చేస్తాయన్నారు. కావున నగర పాలక సంస్థకు చెల్లించవలసిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. పన్ను చెల్లింపుదార్లకు అనుకూలంగా క్యాష్ కౌంటర్లు ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని నగరపాలక సంస్థ కమీషనర్ హరిత తెలిపారు.

## నల్ల దుస్తుల ప్రదర్శనతో నిరసన తెలియజేసిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు

**గూడూరు, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**




మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల నిరవధిక సమ్మె తిరుపతి జిల్లా గూడూరులో శనివారానికి ఐదవ రోజుకు చేరుకుంది. దీక్ష శిబిరం నుండి నల్ల దుస్తులతో కార్మికులు ప్రదర్శనగా పలు వినాదాలతో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి, కార్మికులందరిని పర్మినెంట్ చేయాలి, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ రిస్క్ అలవెన్స్ లు, టెక్నికల్ వేతనాలు ఇవ్వాలి, చనిపోయిన కార్మికుల కుటుంబాలకి న్యాయం చేయాలి, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి, కార్మికులపై వేధింపులు ఆపాలి, రెగ్యులర్ కార్మికులకు ఓ.పి.ఎస్. అమలు చేయాలి, వెంటనే చెల్లించాలి. వంటి నినాదాలతో గూడూరు పట్టణం దద్దరిల్లేలా కార్మికులు నినాదాలు తో ప్రదర్శన గాంధీ బొమ్మ, మీదుగా సంఘం థియేటర్, హాస్పిటల్ రోడ్, టవర్ క్లాక్ సెంటర్,ముత్యాల పేట, సుందర మహల్ మీదుగా, సాధుపేట చేరుకొని అక్కడి నుండి మున్సిపల్ కార్యాలయము వద్ద ఉన్న శిబిరం వద్దకు చేరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రాష్ట్ర కమిటి సభ్యులు బి.గోపినాద్, రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, సి.ఐ.టి.యు పట్టణ అధ్యక్షులు బి.వి.రమణయ్య, శ్రామిక మహిళా సంఘం కార్యదర్శి ఎం.సంపూర్ణమ్మ, జిల్లా కమిటీ సభ్యులు పెంచల ప్రసాద్,(పి.పి), మురళి, ప్రసాద్, రాఘవయ్య, కిషోర్ ,వెంకటరమణ, మనెమ్మ,సుబ్బమ్మ, పోలమ్మ, పెంచలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆర్డీవో కిరణ్ కుమార్

**గూడూరు రూరల్, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**



గూడూరు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా అభ్యర్థిగా గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ కు ఖరారు అయినట్లు దాదాపుగా సమాచారం రీజనల్ కోఆర్డినేటర్ విజయ్ సాయి రెడ్డి, రాష్ట్ర మంత్రి పార్టీలో కీలక పాత్ర పోషించే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జగన్మోహన్ రెడ్డి కి ముఖ్య అనుచరుడిగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిల మద్దతుతోపాటు, సర్వే నివేదికలు కూడా కిరణ్ కుమార్ అభ్యర్థిత్వానికి మొగ్గుగా ఉన్నట్లు సమాచారం దాదాపు కిరణ్ కుమార్ పేరు అధిష్టానం నేడో,రేపో ప్రకటించనున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలో పనిచేసే అధికారిగా మంచి గుర్తింపు రావడం, సమస్యలను సత్వరం పరిష్కరించే అధికారికంగా పేరు రావడంతో ఆయన వైపే వైకాపా అధిష్టానం మొగ్గు చూపుతుందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఇక అధికారికంగా ప్రకటించడమే తరువాయి దాదాపు కిరణ్ కుమార్ పేరు ఖరారు అయినట్లే నని వైకాపా ముఖ్య నాయకులు ద్వారా తెలిసింది. అధికారిక ప్రకటన కోసం వేసి చూడాల్సిందే టిడిపి అభ్యర్థికి సరైన పోటీ కిరణ్ కుమార్ అని రాజకీయ పరిశీలకులు అభిప్రాయ పడుతున్నారు.

## నవరత్నాలు కాదు.. నవమోసాలు!

- ఇచ్చేది గోరంత దోచేది కొండంత'...?
- గూడూరు తెదేపా నాయకులు

**గూడూరు, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**




వంద తప్పులు చేసిన వాడినైనా నమ్ముతారేమో. కానీ 'ఒక్క చాన్సు' అని మోసం చేసినవాడిని ప్రజలు నమ్మారు అని మోసం చేసే బుద్ధి వున్నవారు మోసం చేస్తూనే ఉంటారు అని గూడూరు తేదేపా నాయకులు అన్నారు.సంక్షేమం పేరుతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని మహిళల్ని మోసం చేస్తున్నారని టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు.ఆయన ఇచ్చేది గోరంత అని, కానీ నిత్యావసరాల ధరల్ని పెంచి దోచేది మాత్రం కొండంత అని మండిపడ్డారు.మహిళలపై నేరాలు 25 శాతం మేర పెరిగాయని, వారికి రక్షణ లేని పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు.నవరత్నాల మ్యానిఫెస్టోతో అధికారంలోకి వచ్చి, 85% నవ మోసాలతో ప్రజలందరిని మోసం చేసిందని. తేదేపా నాయకులు అన్నారు.మాజీ శాసన సభ్యులు, పాశిం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు.పట్టణలోని పార్టీ కార్యాలయం నందు మీడియా సమావేశం నిర్వహించిన పట్టణం తెలుగుదేశం పార్టీనాయకులుమీడియాతో మాట్లాడుతూ...పాదయాత్ర చేస్తూ నవరత్నాలు మరియు మ్యానిఫెస్టో హమిలో బాగంగా 199 హామీలు ఇచ్చారు,ఇందులో 17 హామీలను మాత్రమె అమలు పరిచారు.పాదయాత్ర చేస్తూ మొత్తం 730 హామీలు ఇచ్చారు ఇందులో 85% గమిలను నెరవేర్చడం లో ప్రభుత్వం ఫెయిల్ అయింది. రాష్ట్రం నేడు ఆందోళనాంధ్రప్రదేశ్ మారింది.చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన 120 సంక్షేమ పథకాల్ని రద్దు చేశారు. పరిశ్రమల్ని పొరుగు రాష్ట్రాలకు తరిమేశారు,రాజధానిని విధ్వంసం చేశారు.పోలవరాన్ని రివర్స్ చేయడం ద్వారా నదుల అనుసంధానానికి గండికొట్టి రాష్ట్రాన్ని కరవు రక్కసికి బలిపెట్టారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సబ్ నిధులు రూ.1.14 లక్షల కోట్లు దారిమళ్ళించి సామాజిక న్యాయం గొంతుకోశారు. 2.30 లక్షల ఉద్యోగాల భర్తీపై మాట తప్పాడు. అంగన్వాడీలకు తెలంగాణకన్నా రూ.1000 అదనంగా పెంచుతామన్న హామీపై మడమ తిప్పారు. మద్య నిషేధం చేసి ఓటగుతానన్న హామీకి విరుద్ధంగా మద్యం ఆదాయం 15 ఏళ్లు బ్యాంకులకు తాకట్టు పెట్టాడు. విద్యుత్ ఛార్జీలు పెంచనన్న హామీకి విరుద్ధంగా రూ.64 వేల కోట్లు విద్యుత్ భారాలు మోపారు.సీపీయస్ రద్దు, రైతు రుణమాఫీ, మద్య నిషేదం, అమరావతి అభివృద్ధి, ఇసుక అక్రమ తరలింపు నివారణ లాంటి అనేక హామీలపై మాటతప్పి మడమ తిప్పారు. అయినా 99.5% హామీలు అమలు చేశానని అబద్ధాలు చెబుతున్నారు.చంద్రబాబు ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేదల్ని సొంత కాళ్లపై నిలబెట్టింది.సంక్షేమ పథకాలు పేదల్ని నిరుపేదలుగా చేసి వారిని ఓటు యంత్రాలుగా మార్చి తనపై ఆధారపడే బిచ్చగాళ్లుగా చేసారు.టీడీపీ ప్రభుత్వం రూ.3 లక్షలు సబ్సిడీ ఇచ్చి ఒక ఎస్సీ డ్రైవర్కు ఇన్నోవా కారు ఇచ్చి అతన్ని తన కాళ్లపై నిలబెట్టింది.అమ్మఒడికి రూ. 13 వేలు ఇచ్చి నాన్న బుడ్డిలో రూ.70 వేలు కొట్టేస్తున్నాడు. రూ.2 లక్షల కోట్ల విలువ కలిగిన నాసిరకంమద్యం అమ్మి పేదల సంపాదనను కొట్టేశారు... నాసిరకం మద్యం తాగి 30 లక్షల మంది రోగాల బారినపడ్డారు. రాబోయే రోజులలో ఈ ప్రభుత్వానికి చరమ గీతం పాడి చంద్రన్న పాలనకు స్వాగతం పలకడానికి ప్రజలు సిద్దంగా ఉన్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్,కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి,పట్టణ మండల పార్టీ అద్యక్షులు పులిమి శ్రీనివాసరావు,కొండూరు వెంకటేశ్వర్లు రాజు, నాయకులు దువ్వూరు రవీంద్ర రెడ్డి,ఇస్రాయెల్ కుమార్,%వీణ% అబ్దుల్ రహీం,యదనపర్తి జనార్దన్ రెడ్డి, గాయం రమణయ్య,ఏసుపాక పెంచలయ్య,మాతంగి వెంకటయ్య,యువత వేముల సునీల్,సందీప్,సాయి తదితరులు పాల్గొన్నారు.

## యూటియఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ




**వరదయ్యపాలెం, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

ఈ రోజు వరదయ్యపాళెం నందు 2024 సంవత్సరపు యూటియఫ్ డైరీ,క్యాలెండర్ లను ఎంఈఓలు సరస్వతీ , గున్నయ్య ,ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి శశికుమార్, సురేష్ భగవాన్, గౌరవ అధ్యక్షులు రాజమోహన్ బాబు, ఋష్యేంద్రబాబు, కొండలరావు, మునిరాజ, సూర్యనారాయణ, రూపస్,రామారావు, సునీల్,కస్తూరయ్య,తిరుపతి నాయుడు,భాస్కర్, తాత బాబు,హిమంత్ రావు,శ్రీనివాస రావు,కృష్ణ మూర్తి,మేఘవళ్ళి,శివారెడ్డి,అప్పారావు, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ జెండాలు తోరణాలు కాల్చివేసిన వైకాపా కార్యకర్తలు

- చంద్రగిరి పోలీసులుకు ఫిర్యాదు చేసిన టిడిపి నాయకులు



**చంద్రగిరి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

చంద్రగిరి పట్టణంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని కార్యక్రమం నిర్వహించడంలో భాగంగా పంచాయతీ అధికారుల అనుమతితో టిడిపి నాయకులు జమండ్ల వీధి, బజారు వీధి, ఆకుతోటవీధి,మాతావీధి లలో ఏర్పాటుచేసిన పార్టీ జెండాలను తోరణాలను వైసిపి దుండగులు తగలబెట్టినట్లు టిడిపి నాయకులు శనివారం పోలీసులుకు రాత మూలకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ తమ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి ఇంటింటి ప్రచారం చేస్తున్న సందర్భంలో తాము పంచాయతీ అధికారుల అనుమతిని తీసుకుని పార్టీ జెండాలను, తోరణాలను అలంకరించామన్నారు. శుక్రవారం రాత్రి వైసిపి కి చెందిన ఇద్దరు ప్రధాన కార్యకర్తలు,మరి కొంత మందితో కలిసి మద్యం సేవించి తమ పార్టీ జెండాలను తోరణాలను పిరికి తాశీల్దార్ కార్యాలయ ఆవరణలో తగలబెడుతుండగా స్థానికులు చూసి ప్రశ్నించారని చెప్పారు. సదరు దుండగులును స్థానికులు అడిగినందుకు గంజాయి మత్తులో దౌర్జన్యం చేశారని వాపోయారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ప్రచారం చేసుకోవచ్చుని వారికి నచ్చిన విధంగా జండాలు, తోరణాలు అధికారుల ముందస్తు అనుమతితో కట్టుకోవచ్చన్న నిబంధనలను తాము పాటించామని, అయితే అధికార పార్టీకి చెందిన వైసిపి దుండగులు ఎమ్మెల్యే చెవిరెడ్డి ప్రోత్సాహంతో తమ పార్టీ జెండాలను తోరణాలను పెరికి తగలబెట్టారని, వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రశాంత వాతావరణంలో తాము కొనసాగిస్తున్న కార్యక్రమాన్ని అడ్డుకోవటానికి విచక్షణారహితంగా ప్రవర్తిస్తున్న వైసిపి చర్యలను తాము ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇలాంటి చర్యలు కారణంగా శాంతి భద్రతలు లోపించే ప్రమాదం ఉన్నదని సిఐ రాజశేఖర్ దృష్టికి తీసుకుని వచ్చారు. రాత్రిలో గస్తీ తిరుగుతున్న పోలీసులు ఈ విషయాన్ని చూసి వారించేందుకు ప్రయత్నించినా వారు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో టిడిపి మండల పార్టీ నాయకులు, యువత, వివిధ విభాగాల శ్రేణులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి : సీఐ రాజశేఖర్



**చంద్రగిరి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

చంద్రగిరి మండల పరిధిలోని ప్రజలకు నూతన శుభాకాంక్షలు తెలుపుతు సిఐ రాజశేఖర్ ఓ ప్రకటన విడుదల చేశారు. రానున్న కొద్ది రోజులలో నూతన సంవత్సర సందర్భంగా డిసెంబర్ 31 తేదీన రాత్రి మద్యం తాగి బైక్ నడపడం, బైకులపై త్రిబుల్ రైడింగ్ చేస్తూ కేరింతల కొడుతూ బైకులను స్నేక్ డ్రైవింగ్ చేస్తూ తోటి వారికి ఇబ్బంది కలిగిస్తూ అశాంతి వాతావరణం కలిగించాలని చూస్తే వారిని గుర్తించి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ రాజశేఖర్ హెచ్చరించారు. రాత్రి 12 తరువాత కేకులు కట్ చేసిన డాన్సులు చేసిన మద్యం సీసాలతో బహిరంగంగా కనిపించినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. నూతన సంవత్సర సందర్భంగా అతి ఉత్సాహం చూపిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించే విధానంగా ప్రవర్తిస్తూ ప్రభుత్వ ఆస్తులు కానీ ప్రజల ఆస్తులు కానీ ధ్వంసం చేసే వారిపై కేసులు నమోదు చేసి నష్టపరిహారం పై చర్యలుంటాయన్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పే క్రమంలో అసభ్య సందేశాలు, అసభ్య ఫోటోలు పంపించిన చట్ట రిత్యా చర్యలు తీసుకుంటామన్నారు. నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీసులు వాహన తనిఖీలు డ్రంక్ అండ్ డ్రైవ్ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నూతన సంవత్సర వేడుకలలో భాగంగా తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేయడం ఏమనగా మీమీ పిల్లలతో సంయుక్తముగా కుటుంబ సమేతంగా మీ ఇండ్లలోనే వేడుకలు జరుపుకోవాలని సూచించారు. క్షణికావేశంలో తాత్కాలిక ఆనందం కోసం చేసే చర్యల వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే అది మీ కుటుంబంలో తీరని నష్టం కలిగే ప్రమాదంతో పాటు పిల్లల భవిష్యత్తు నాశనం కావడం జరుగుతుందన్నారు. హొటల్స్ మరియు ప్రవేటు ప్రదేశాలలో చేసుకునే వారు ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. జనవరి 1 తరువాత ఎటువంటి ఫంక్షన్లకు అనుమతి లేదు అని తెలిపారు.

## నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**



రెండో పట్టణ పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీకాళహస్తి పట్టణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ కొత్త సంవత్సరాన్ని ప్రశాంతమైన వాతావరణం లో జరుపుకోవాలని కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే నెపంతో రోడ్లపై కి రావడం మరియు కేకలు వేయడం నిషేధించడమైనదన్నారు. రాత్రి 10.30 దాటిన తరువాత ముఖ్యమైన పని ఉంటే తప్ప అనవసరంగా రోడ్ల పై తిరగరాదని ముఖ్యంగా యువత రోడ్లపై కేకులు కట్ చేయడం మరియు మోటార్ సైకిల్స్ పై అర్ధ రాత్రి వరకు తిరగడం చేయరాదన్నారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే కార్యక్రమాన్ని తమ తమ కుటుంబ సభ్యులు తో కలసి జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలా కాదని పై తెలిపిన కార్యక్రమాలు కు పాల్పడిన యెడల మీ యొక్క మోటార్ బైక్ లను జప్తు చేసి చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోబడునన్నారు.

# బెదిరింపులు, దౌర్జన్యాలు, అవినీతి, అక్రమాలు....!!

- వ్యవస్థలను అడ్డంపెట్టుకుని ఇష్టారాజ్యంగా పాలన..!!
- సంక్షేమం, అభివృద్ధి "పులివర్తి నాని"తోనే సాధ్యం...!!
- టీడీపీ మహిళా నేత "పులివర్తి సుధారెడ్డి"



**చంద్రగిరి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**


చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కనుసన్నల్లో దౌర్జన్యాలు, అవినీతి, అక్రమాలు, అక్రమ కేసులకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఏర్పడిందని చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడు పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి అన్నారు. మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ఘూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం చంద్రగిరి పట్టణం, విజయనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా మండల నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. **వ్యవస్థలను అడ్డంపెట్టుకుని ఇష్టారాజ్యంగా పాలన..!!**

పాలనలో వ్యవస్థలను అడ్డం పెట్టుకొని టీడీపీ ఓటు బ్యాంకును దెబ్బతీసే విధంగా పార్టీ సానుభూతిపరుల ఓట్లను అనైతికంగా తొలగిస్తున్నారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు పనిచేయాల్సిన అధికారులు ఎమ్మెల్యే చెవిరెడ్డి చెప్పిందే చట్టంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఆధారాలతో సహా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని ఖచ్చితంగా చర్యలు తీసుకుంటారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

**సంక్షేమం, అభివృద్ధి "పులివర్తి నాని"తోనే సాధ్యం...!!**

ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా నిత్యం ప్రజా సమస్యలపై గళమెత్తుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తోనే సంక్షేమం, అభివృద్ధి రెండు సాధ్యమని పులివర్తి సుధారెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ పాలనలో సామాన్యులు సంతోషంగా బతికే పరిస్థితి లేదన్నారు. మినీ మేనిఫెస్టో ద్వారా ఒక్కో కుటుంబానికి ఏటా రూ.1.22 లక్షలు ఆర్థికసాయం అందుతుందని అంతేకాదు అదనంగా 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కలుగుతుందని చెప్పారు.రాష్ట్ర సంపద పెంచాలన్న, పేదలకు పంచాలన్నా చంద్రబాబుతోనే సాధ్యం అని స్పష్టం చేశారు. చంద్రగిరిలో శాంతిభద్రతలు కరవయ్యాయని అన్నారు . ఎన్ని కుట్రలు చేసినా ఈసారి చంద్రగిరిలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరడం ఖాయమని పులివర్తి సుధారెడ్డి స్పష్టం చేశారు.

# మలుపులు ప్రమాదానికి పిలుపులు



**వరదయ్యపాలెం, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

వరదయ్యపాలెం మండలంలో పలు గ్రామాల వద్ద రోడ్డు మలుపులు ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా వరదయ్యపాలెం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం రోడ్డు మలుపులో భారీ వాహనాలకు ఇరుకుగా మారి దుకాణాల మీదకి వెళ్లడంతో దుకాణలకు వాహనాలు తగిలి దుకాణాలు ప్రమాదానికి గురి అవుతున్నాయి ద్విచక్ర వాహనాల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో పలువురు వాహన చోదకులు ఈ మలుపు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని దాటవలసి వస్తుందని చెప్తున్నారు మరికొందరు క్షతగాత్రు లవుతున్నారు. ఇదే రోడ్డులో కడూరు వద్ద కాలువపై ఉన్న వంతెన వద్ద కూడా దగ్గరి మలుపుతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చే వరకూ కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నా యి. అలాగే కడూరు క్రాస్ సమీపంలోని చివరలో ఉన్న మలుపు వద్ద కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. తడ, బత్తులవల్లం, వరదయ్యపాలెం మీదగా శ్రీకాళహస్తి వరకు రహదారుల్లో కూడా ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఇక్కడ వాహనచోదకులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. పలు మలుపుల వద్ద పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే, చాలాచోట్ల ఎక్కువగా మలుపు రోడ్డు ఉండడం వలన వాహనాచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు . ఇప్పటికైనా తడ నుంచి శ్రీకాళహస్తి రోడ్డును గురించి అధికారులు ఆలోచించాలని వాహనచోదకులు అధికారులను కోరుతున్నారు.

# కేంద్ర సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోండి





- కోలా ఆనంద్ కుమార్- అసెంబ్లీ కన్వీనర్, రాష్ట్ర కార్యదర్శి

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి సూచనలు ప్రకారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శ్రీకాళహస్తి అసెంబ్లీ నందు జరుగుతున్న కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ కన్వీనర్ కోలా ఆనంద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ ప్రజల వికాసమే దేశ వికాసమనే నినాదంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంకల్ప కృషితో శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రేణిగుంట మండలం నందు గల తుకివాకం, ఎల్లమండ్యం, ఏర్పేడు మండలంలో కొత్త వీరాపురం, మోదుగుల పాలెం, శ్రీకాళహస్తి రూరల్ మండలంలో ఎంపేడు, పాతగుంట పంచాయతీలలో శనివారం ఘనంగా వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించబడినది. నరేంద్ర మోడీ నిరుపేద కుటుంబంలో జన్మించి వారు చిన్నతనంలో అనేక రకములైన కష్టాలు అనుభవించి, ఈ రోజు దేశ ప్రధానమంత్రిగా ప్రజల అభివృద్ధి, సంక్షేమం, ఆరోగ్యం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, వాటి ఫలాలు అందరు అనుభవించాలనేది మోదీ సంకల్పం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సూరిపాకుల సుబ్రమణ్యం, సభ్యులు కండ్రిగ ఉమ, జిల్లా సెక్రెటరీ, అసెంబ్లీ పార్టీ కో – కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పెనుబాల చంద్రశేఖర్, బి.డి. బాలాజీ, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి గోపాల్, మండల అధ్యక్షులు ధర్మారెడ్డి బొబ్బిలి రెడ్డి, కునాటి నాగరాజు, జీపాలెం కృష్ణా రెడ్డి, జీపాలెం తేజో వతి కుప్ప ప్రసాద్, మెండు బాలగురవయ్య, వేదం కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిలు ఆర్కాడు వంశీ, పోలి సత్యనారాయణ, ఆవుల రాజశేఖర రెడ్డి, సర్పంచ్ భువనమ్మ, ఈఓ పి ఆర్ డి. లు మేకల వెంకటరత్నమ్మ, రమణ కుమార్, పంచాయతీ సెక్రటరీలు వెంకట రత్నం, శంకరయ్య, ఓబీసీమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ వి రమణ, పగడాల ప్రతాప్, కోట వెంకటేష్, కాశీ రాజనేల, చిత్తికాటు బాలాజీ, వివిధ డిపార్ట్మెంట్ ల అధికారులు, లబ్ధిదారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పాపానాయుడుపేటలోని బంగారు దుకాణంలో చోరీ

- కత్తులు తుపాకులతో చొరబడ్డ దొంగలు



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

ఏర్పేడు మండలం పాపానాయుడు పేటలోని వైఎస్ఆర్ పార్టీకి చెందిన ఓ నాయకుడు బంగారం దుకాణంలో దొంగలు చొరబడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నంబర్ ప్లేట్ లేని పల్సర్ బైక్ లో ముగ్గురు దొంగలు వచ్చి కత్తుల తుపాకులు చూపించి బంగారు దుకాణంలోని బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించారు. షాపులో ఉండేవాళ్ళు గట్టిగా అరవడంతో స్థానికులు చేరుకునీ ఒక దొంగను పట్టుకున్నారు. మరో ఇద్దరు దొంగలు పరారయ్యారు. సంఘటన స్థలానికి ఏర్పేడు, గాజులుమండ్యం పోలీసులు చేరుకునీ విచారణ చేపడుతున్నారు. నగల దుకాణంలో ఎంత బంగారం చోరీకి గురి అయింది అనే విషయం పోలీసులు విచారణలో తేలాల్సి ఉంది.

# నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం

- న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు
- ఆర్కెస్ట్రా, డీజేలపై నిషేధం
- ప్రతి చోటా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- కోట ఎస్ ఐ.పి.నాగబాబు వెల్లడి




**కోట, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

జిల్లాలో నూతన సంవత్సర వేడుకలపై పోలీసులు ఆంక్షలు విధించారు.అల్లర్లు, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.నూతన సంవత్సర వేడుకలపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ ఐ పీ.నాగబాబు హెచ్చరించారు.ఈ సందర్భంగా శనివారం కోట ఎస్ ఐ నాగబాబు మాట్లాడుతూ టపాకాయలు కాల్చడం,ఆర్కెస్ట్రా,డీజేను నిషేధించినట్లు ఆయన తెలిపారు.నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కమిషనరేట్ పరిధిలోని రోడ్లపైకి వచ్చే ప్రతి వాహనాదారుడూ అల్లర్లు సృష్టించకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అయితే నిబంధనలను పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచే రోడ్లపై ప్రత్యేక తనిఖీలతోపాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను సైతం నిర్వహిస్తాయన్నారు.డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారి వివరాలను ఫొటో, వీడియో ద్వారా రికార్డ్ చేసి వారిపై కేసులు నమోదు చేస్తాయని తెలిపారు. బహిరంగ ప్రదేశాలో మద్యం సేవించేవారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. మైనర్లలకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు.మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

# ద్విచక్ర వాహనాలపైకి దూసుకెళ్లిన కారు

**చంద్రగిరి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**



తిరుపతి-మదనపల్లి జాతీయ రహదారిలో ఎంబి యూనివర్శిటీ వద్ద రోడ్డు ప్రక్కన ఆగి ఉన్న ద్విచక్ర వాహనాలను కారు ఢీకొన్న ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన స్విఫ్ట్ కారు పీలేరు నుండి తిరుపతికి వచ్చే క్రమంలో ఎంబి యూనివర్శిటీ సమీపంలోకి రాగానే అదుపు తప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న మూడు ద్విచక్ర వాహనాలపైకి దూసుకెళ్లి, డివైడర్ను ఢీకొని ఆగింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాల వద్ద ఉన్న నలుగురు విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. వాహనంలోని ముగ్గురు యువకులు మద్యం సేవించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను 108లో తిరుపతి రుయాకు తరలించారు. ప్రమాదానికి కారణమైన వివరాలు పోలీసులను వివరణ అడుగగా వీరు తమిళనాడుకు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. డ్రింక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేసినట్లు, బాధితులతో మాట్లాడినట్లు బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరుగుతుందని సి.ఐ రాజశేఖర్ తెలిపారు.

# అంకురా ఆసుపత్రిలో వైద్య విధానంలో అరుదైన ఒరవడి



**తిరుపతి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

కడపకు చెందిన,ఫౌజాన్ అహ్మద్ అనే 10 ఏళ్ల బాలుడు, ప్రమాదవశాత్తు మింగిన పదునైన బోర్డ్ పిన్.ను. అంకురా హాస్పిటల్ వైద్యులు బ్రోంకోస్కోపీ అనే అతి క్లిష్టమైన ఆపరేషన్ ద్వారా,తొలగించి బాలుడి ప్రాణాలను కాపాడడం జరిగిందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. శనివారం తిరుపతి అంకురా ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను వారు మీడియాకు వెల్లడించారు..ఈ విలేకరుల సమావేశంలో.. ప్రఖ్యాత పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ విట్టల్ మోహన్ పల్మోనాలజిస్ట్ డాక్టర్ నరసింహ, అనథీటిస్ట్ డాక్టర్ శ్రీకాంత్, పిఐసియు టీమ్ డిఆర్ వంశీకృష్ణ, డాక్టర్ దినేష్, డాక్టర్ పృథ్వి, డాక్టర్ రామ్ మోహన్ పీడియాట్రిషియన్స్ బృందం పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలను పాటించకపోతే చర్యలు తప్పవు

- ఒకటవ పట్టణ ఎస్.ఐ పుల్లారావ్



**గూడూరు రూరల్, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

వాహన చోదకులు ప్రతి ఒక్కరూ నియమాలను పాటిస్తూ రాకపోకలు సాగించాలని ఒకటవ పట్టణ ఎస్.ఐ పుల్లారావు సూచించారు సరైన పత్రాలు లేకుండా ప్రయాణించినా ట్రాఫిక్ నియమాలను అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు శనివారం స్థానిక సాదుపేట సెంటర్ లో ఎస్.ఐ ద్విచక్ర వాహనదారుల వద్ద పత్రాలు పరిశీలించారు సరైన పత్రాలు లేని వాహన దారులకు కౌన్సిలింగ్ నిర్వహించి పంపారు.

# గంజాయి విక్రయించే వారిపై కఠిన చర్యలు

- గంజాయి అక్రమ రవాణాపై గట్టిగా నిఘా

**వెంకటగిరి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**



నూతన సంవత్సరం సందర్భంగా వెంకటగిరి గూడూరు నాయుడుపేట సూళ్లూరుపేట ప్రాంతాలలో గూడూరు డివిజన్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ ఎస్సై విజయ్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ నూతన సంవత్సర సందర్భంగా యువత మత్తు పదార్థాలు బాయారిన పడకుండా ఉండాలని ఆయన తెలిపారు.గంజాయి విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పని డివిజన్ టాస్క్ ఫోర్స్ ఎస్సై విజయ్ కుమార్ తెలియజేశారు.

# రోడ్డెక్కిన న్యాయవాదులు

- మోటార్ సైకిల్‌తో నిరసన ర్యాలీలు
- ప్రజలకు యాక్ట్ 27 .2023 గురించి ప్రజలకు అవగాహన చేస్తున్న న్యాయవాదులు.
- యాక్ట్ అమలయితే ప్రజల ఆస్తులకు రక్షణ కరువవుతుంది.
- 27 యాక్ట్‌ను రద్దు చేయాలని అంబేద్కర్ విగ్రహం, పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన..
- కలెక్టరేట్ ప్రాంగణంలో మానవహారం నిర్వహించిన న్యాయవాదులు.
- పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి కి భీమవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం

**భీమవరం, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 27 యాక్ట్ ప్రజల ఆస్తులు కు రక్షణ లేకుండా పోతుందని న్యాయ విజ్ఞానం లేని ఎమ్మార్వోలు ఆర్డీవోలు కు అప్ప చెప్పడం దారుణమని ఈ విషయాల్లో వారికి ఏ పరిజ్ఞానం లేదని లింక్ డాక్యుమెంట్లు హైకోర్టు సుప్రీంకోర్టు జడ్జిమెంట్లు చదివి ఆస్తులు ఎవరికి చెందుతాయో నిర్ణయించే అధికారం కేవలం న్యాయస్థానాలకి ఉందని న్యాయస్థానాలు స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉంటాయని రాజకీయ ఒత్తుళ్లకు కోర్టు లొంగదని కోర్టులన్నీ కూడా ఓపెన్ గా ఉంటాయని ప్రజలు ఎమ్మార్వో ఆర్డీవో కార్యాలయాలకు వెళితే వారు సమయం ఇచ్చేవరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మొగుళ్ళ వెంకటరమణారావు అన్నారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలో బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద గల కోర్టు కాంప్లెక్స్ ప్రాంగణంలో గత పది రోజులుగా భీమవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈరోజు ప్రత్యేక నిరసన మోటార్ సైకిల్ ర్యాలీ ద్వారా టూ టౌన్ అద్దంతేనా, అంబేద్కర్ సెంటర్, ప్రకాశం చౌక్, బుధవారం మార్కెట్, విస్సాకోడేరు బ్రిడ్జి మీదుగా నిరసన ర్యాలీ నిర్వహిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి కి 27 యాక్ట్ ను రద్దు చేయాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వార్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బంటుమిల్లి కృష్ణ, కన్వీనర్ నీలాటి రమేష్ కార్యదర్శి రాపాక రమేష్, సీనియర్ న్యాయవాదులు, మొగంటి శివకృష్ణ, కెవి రమేష్, మేక శివ లు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 27/ యాక్ట్ ల్యాండ్ టైటిల్ చట్టాన్ని రద్దు చెయ్యాలి అని ఈ జీవో ద్వారా ఎంతోమంది ప్రజలు భారీగా నష్టపోయే అవకాశం ఉందని ప్రజలకు అవగాహన చేయవలసిన బాధ్యత మాపై ఉందని గత పది రోజులుగా ఈ రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు మాకోసం ఎంతో స్పందించి మాట్లాడారని మీకు పూర్తిస్థాయిలో సపోర్ట్ చేస్తానని తెలపడం ఆనందదాయకమని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ జీవో ని వెనుక తీసుకోకపోతే ఆమరణ నిరాహార దీక్ష కూడా వెనుకడేదే లేదని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు.





జగన్ ప్రభుత్వం ప్రజా హక్కుని తమ చేతుల్లోకి లాక్కొని ప్రజలను ఇబ్బంది పెట్టే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ యాక్టును వెనక తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పాక రమేష్, కన్వీనర్ నీలాటి రమేష్, మహిళా కన్వీనర్ ఉమ రాణి, అడ్వొకేటెస్ డి కె వి ప్రకాష్, మొగంటి శివ కృష్ణ, రామని కాస్ట్రో, సూర్యనారాయణ, సాయి, మేక శివ, తదితరులు పాల్గొన్నారు

# విలక్షణ నటుడు కొంగర జగ్గయ్య

కొంగర జగ్గయ్య విలక్షణ నటుడు. ఎన్టీఆర్ ఏఎన్నార్ లతో పాటు, విశేష ప్రేక్షకాదరణ, అశేష అభిమానులను పొందిన నటుడు. ధరించిన పాత్ర ఏదైనా తన విలక్షణమైన నటనతో ఆ పాత్రకు ప్రాణప్రతిష్ట చేసి ఒక ప్రత్యేకతను, నిండుతనాన్ని, హుందాతనాన్ని సంతరింప జేసిన విశిష్ట వ్యక్తి జగ్గయ్య. జగ్గయ్య సినీ నటుడే కాదు ఒక రచయిత, సాహిత్యకారుడు, కళావాచస్పతి, చిత్రకారుడు, పాత్రికేయుడు, సంపాదకుడు, రాజకీయవేత్త. ఆకాశవాణి ఢిల్లీ కేంద్రంలో అనౌన్సర్. "ఆకాశవాణి... వార్తలు చదువుతుంది కొంగర జగ్గయ్య" అంటూ కంచు కంఠంతో ఆయన వార్తలు చదివిన సంగతి ఆనాటి శ్రోతలకు విదితమే. కొంగర జగ్గయ్య (డిసెంబర్ 31, 1928 – మార్చి 5, 2004) మాజీ పార్లమెంటు సభ్యుడు, ఆకాశవాణిలో తొలితరం తెలుగు వార్తల చదువరి. సినిమాలలోను, అనేక నాటకాలలోను వేసిన పాత్రల ద్వారా ఆంధ్రులకు జగ్గయ్య సుపరిచితుడు. మేఘ గంభీరమైన ఆయన కంఠం కారణంగా "కంచు కంఠం" జగ్గయ్యగా, "కళా వాచస్పతి"గా పేరు గాంచాడు. శివాజీ గణేశన్ నటించిన చిత్రాలు తెలుగులోకి అనువదించిన అన్ని సందర్భాల్లో జగ్గయ్యే కంఠం వినిపించేది. 'కళావాచస్పతి' అనేది జగ్గయ్యకు ప్రదానం చేసిన బిరుదు కాదు. అది ఢిల్లీ లోని అంతర్జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఇచ్చిన గౌరవ డాక్టరేటు. స్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. ఉద్యమ పోరాటంలో పాల్గొంటూ అజ్ఞాత వాసంలో తలదాల్చు కునేందుకు వచ్చిన అంతర్రాష్ట్ర సమర యోధులకు తన ఇంటిలో ఆవాసం కల్పించిన దేశ భక్తుడు జగ్గయ్య.

జగ్గయ్య గుంటూరు జిల్లాలోని తెనాలికి సమీపంలో దుగ్గిరాల దగ్గర మోరంపూడి అనే గ్రామంలో, 1928, డిసెంబర్ 31 న ధనవంతుల కుటుంబంలో జన్మించాడు. 11 సంవత్సరాల పిన్న వయసులో రామాయణంలోని లవుడి పాత్రను బెంగాలీ రచయిత ద్విజేంద్రలాల్ రాయ్ వ్రాసిన సీత అనే ఒక హిందీ నాటకంలో పోషించాడు. గుంటూరు లోని ఆంధ్రా క్రిస్టియను కాలేజీలో ఎన్.టి.రామారావు, కొంగర జగ్గయ్య ఇద్దరు సహ విద్యార్థులు. వీళ్ళిద్దరూ కలిసి ఎన్నో నాటకాలు ప్రదర్శించారు. జగ్గయ్య మూడు సంవత్సరాల పాటు వరుసగా ఉత్తమ నటుడు పురస్కారం పొందాడు. ఇంటర్మీడియట్ తరువాత కొంత కాలం "దేశాభిమాని" అనే పత్రికలో ఉప సంపాదకుడిగానూ, ఆ తర్వాత "ఆంధ్రా రిపబ్లిక్" అనే ఆంగ్ల వారపత్రికకు సంపాదకుడిగానూ పనిచేశాడు. ఢిల్లీలో "ఆల్ ఇండియా రేడియో"లో మూడు సంవత్సరాల పాటు వార్తలు చదివే ఉద్యోగం చేసాడు. చిత్రకారుడు అడవి బాపిరాజు వద్ద చిత్రలేఖనంలో శిక్షణ పొందాడు. 1950ల నుండి 1970ల వరకు తెలుగు చిత్ర పరిశ్రమకు ఎనలేని సేవ చేసాడు. జగ్గయ్య దాదాపు 500కు పైగా చిత్రాలలో, వంద సినిమాల్లో హీరోగా, మరో వంద సినిమాల్లో సహ కథానాయకుడిగా నటించారు. రెండువందల చిత్రాల్లో క్యారక్టర్ నటుడుగా రాణించాడు. ఎన్.టి.రామారావుతో కలిసి విజయవాడలో రవి ఆర్ట్ థియేటర్ స్థాపించి ఎన్నో నాటకాలు వేసి పరిషత్తు పోటీలలో బహుమతులు గెలుచుకున్నాడు. బుచ్చిబాబు వ్రాసిన దారిన పోయే దానయ్య నాటిక జగ్గయ్యకు పేరు తెచ్చి పెట్టింది.

ఎన్.టి. రామారావు, జమున, సావిత్రి, గుమ్మడి, ముక్కామల వంటి నటీనటులతో రంగస్థలం మీద నటించిన జగ్గయ్య ఎందరు నటులకో మార్గదర్శకుడు. నటి సావిత్రి నాట్యానికే పరిమితమైన ఆరోజుల్లో తను రచించిన 'బలిదానం' అనే నాటకం ద్వారా రంగస్థల నటిగా మార్చిన ఘనత జగ్గయ్యకు దక్కుతుంది. 100కు పైగా సినిమాలలో డబ్బింగు చేసాడు. తమిళ చిత్రరంగ నటుడు శివాజీ గణేశన్ నటించిన తెలుగు సినిమాలలో జగ్గయ్యే గాత్రధారణ చేసేవాడు. అంతేకాదు తెలుగులోకి డబ్బింగు చేసిన జురాసిక్ పార్క్ అనే ఆంగ్ల చిత్రంలో రిచర్డ్ అట్టెంబరో పాత్రకు తన గాత్రాన్ని అరువు ఇచ్చాడు. అల్లూరి సీతారామరాజులో పోషించిన రూథర్ ఫర్డ్ పాత్ర ఆయన జీవితంలో మరపురానిది. ఆ సినిమా తీసే నాటికి రూథర్ ఫర్డ్ చరిత్ర మరచి పోయిన వ్యక్తి కాదు. రూథర్ ఫర్డ్ ఎలా ఉంటాడో, ఎలా ప్రవర్తించేవాడో తెలిసిన వాళ్ళు అప్పటికి చాలా ఉన్నారు. 1940 వరకు ప్రభుత్వ సర్వీసులో ఉన్నాడు. కృష్ణా జిల్లా, గుంటూరు, కడప తదితర ప్రాంతాల్లో పనిచేశాడు. వారిని కలిసి, జగ్గయ్య రూథర్ ఫర్డ్ ప్రవర్తన గురించి, మనస్తత్వం గురించి తెలుసు కున్నాడు. రూథర్ ఫర్డ్ చాలా మంచి వ్యక్తి అని, సీతారామరాజు అంటే ఆయనకు గౌరవం ఉండేదని తెలుసు కున్నాడు. అయితే రూథర్ ఫర్డ్ బ్రిటిష్ ప్రభుత్వానికి విధేయుడుగా, సేవకుడిగా అతను సీతారామ రాజును పట్టుకోక తప్పని స్థితి గురించి అవగాహన కలిగాక, జగ్గయ్య చిత్ర రచయిత మహారథిని కలిసి ఆ పాత్రను రొటీన్ విలన్ లా కాకుండా విధి నిర్వహణకు బద్ధుడై ఉండే హుందా అయిన వ్యక్తిలా మార్చి వ్రాయాలని కోరాడు. అలా ఆ పాత్ర చిత్రణ మార్చడంతో ఆ పాత్ర నిలబడడంతో బాటు సీతారామరాజు పాత్ర మరింతగా హిట్ అయింది. ఆ సినిమా చూశాక పి.వి.నరసింహారావు జగ్గయ్యకు ఫోన్ చేసి "మీ పాత్ర పోషణ అద్భుతం." అని ప్రశంసించారట.

1967లో నాలుగవ లోక్‌సభకు జరిగిన ఎన్నికలలో ఒంగోలు నియోజక వర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి, 80 వేల ఓట్ల మెజారిటీతో గెలిచాడు. లోక్‌సభకు ఎన్నికైన తొలి దక్షినాది, తొలి భారతీయ నటుడు జగ్గయ్య కావడం విశేషం. 1930లో గాంధీజీ నాయకత్వంలో జరిగిన సహాయ నిరాకరణోద్యమం నేపథ్యంలో డాన్సులు, డ్యుయెట్ల వంటి ఆకర్షణలు లేకుండా "పదండి ముందుకు" తీశారు. ఈ తొలి రాజకీయ చిత్రానికి రాష్ట్ర ప్రభుత్వం 50,000 రూపాయల పురస్కారాన్ని ఇచ్చింది. ఈ సినిమా రష్యాలో తాష్కెంట్ ఫిల్మ్ ఫెస్టివల్ తో బాటు మరికొన్ని నగరాల్లో ప్రదర్శితమైంది. సంభాషణలతో బాటు చిత్రం చివర్లో వచ్చే 'మంచికి కాలం తీరిందా' అనే పాటను కూడా జగ్గయ్యే వ్రాశాడు. ఇది మహమ్మద్ రఫీ పాడిన తొలి తెలుగు పాట. కృష్ణ ఒక చిన్న పాత్ర చేశారు. మోహన్ బాబు నిర్మించిన 'కుంతీపుత్రుడు' లో జగ్గయ్య చివరిసారిగా నటించారు. నోబెల్ పురస్కారము అందుకున్న రవీంద్రుని గీతాంజలిని "రవీంద్ర గీతా" అనే పేరుతో తెలుగులోకి అనువదించాడు. గీతాంజలికి ఇది తొలి తెలుగు అనువాదం. రవీంద్రనాథ ఠాగూరు రాసిన నాటకం "సాక్రిఫైస్" ను తెలుగులోకి "బలిదానం" అనే పేరుతో అనువదించాడు.

భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన "పద్మభూషణ్" తో సత్కరించింది. ఢిల్లీ లోని సంస్కృత విశ్వ విద్యాలయం "కళా వాచస్పతి"అనే బిరుదుతో జగ్గయ్యను సత్కరించింది. తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ "డాక్టరేటు"తో సత్కరించింది. తమిళనాడు ప్రభుత్వం "కలైమామణి" బిరుదు నిచ్చింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం "కళాప్రపూర్ణ" బిరుదుతో సత్కరించింది. 2004, మార్చి 5 న 76 సంవత్సరాల వయసులో చెన్నైలో గుండెపోటుతో జగ్గయ్య మరణించాడు.

# ఎర్ర సముద్రంలో పరిణామాలు

అగ్రరాజ్య ఆధిపత్య క్రీడలో భాగంగా గాజాలో ఇజ్రాయిల్ గత 80 రోజులుగా సాగిస్తున్న నరమేధం ప్రపంచ యవనికపై విపరీత పరిణామాలకు దారి తీస్తోంది . 21 వేల మందికిపైగా పాలస్తీనీయులను పొట్టనపెట్టుకున్న ఇజ్రాయిల్ హంతక దాడులను ఆపాలంటూ హౌతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్రం గుండా రాకపోకలు సాగించే ఇజ్రాయిలీ సరకు రవాణా నౌకలతో బాటు, దానికి మద్దతు ఇస్తున్న దేశాల నౌకలను కూడా లక్ష్యంగా చేసుకోవడం ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి.ప్రపంచమంతా గర్హిస్తున్నా, దాడులు ఆపాలంటూ ఐక్యరాజ్య సమితి తీర్మానాలు చేస్తున్నా ఇజ్రాయిల్ పట్టించుకోవడం లేదు. ఇజ్రాయిల్‌కు బాహాటంగా ఆయుధాలు, డబ్బు అందిస్తున్న అమెరికా తక్షణం కాల్పులు విరమించాలన్న ఐరాస భద్రతా మండలి తీర్మానాలన్నింటినీ వీటో చేస్తోంది. వైద్యసాయం, ఆహారం అందకుండా 20 లక్షలమందికిపైగా ఆకలి కోరల్లో చిక్కుకునే పరిస్థితికి కారణమైంది. అమెరికా ఒత్తిడికి తలొగ్గి మోడీ ప్రభుత్వం దేశ ప్రయోజనాలను పణంగా పెట్టడానికి సిద్ధమైంది. సైద్ధాంతికంగా తనకు సన్నిహితమైన పచ్చి మిత వాద నెతన్యాహు ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నది.

ఎర్రసముద్రంలో సరుకు రవాణా నౌకలపై హౌతి తిరుగుబాటు దారులు జరుపుతున్న దాడులకు అమెరికాతో బాటు దానికి తందాన తాన అంటున్న మోడీ ప్రభుత్వం కూడా బాధ్యత వహించాలి. ప్రపంచ నౌకా రవాణాలో 30 శాతం, వ్యాపారంలో 12 శాతం, సముద్ర జలాలపై పెట్రోలియం వాణిజ్యంలో 10 శాతం మధ్యదరా సముద్రాన్ని హిందూ మహాసముద్రంతో కలిపే ఎర్రసముద్రం మీదుగానే సాగుతున్నాయి. మోడీ ప్రభుత్వ తప్పుడు విదేశాంగ విధానం ఫలితంగా భారత్ నావికా వాణిజ్యం ఇప్పుడు ప్రమాదంలో పడింది. ఇజ్రాయెల్ వెళ్తున్న నౌకలే ప్రధాన లక్ష్యమని అంటున్నా, దానితో అంటకాగుతున్న పలు దేశాల నౌకలపై దాడులు జరుగుతున్నాయి. గాజాలో ఇజ్రాయిల్ హంతక దాడులను తక్షణం నిలిపివేసేలా చూడడమేనని హౌతీ తిరుగుబాటు దారులు ప్రకటించారు. గత వారం అరేబియా సముద్రం మీదుగా ఇండియా వస్తున్న వాణిజ్యనౌక ఎంవి కెమ్ ఫ్లూటో మీద గుజరాత్‌కు నాలుగువందల కిలోమీటర్ల దూరంలో డ్రోన్ దాడి జరిగింది. ఆ తరువాత కొద్దిగంటల్లోనే సౌదీనుంచి వస్తున్న ఎంవి సాయిబాబా మర్చంట్ నౌక మీద ఎర్రసముద్రంలో దాడి జరిగింది. సౌదీ యువరాజు మొహ్మద్ బిన్ సల్మాన్‌కు భారత ప్రధాని ఫోన్ చేసి ఎర్ర సముద్రంలో భారతీయ నౌకలకు భద్రత కల్పించేలా చూడాలని అభ్యర్థించారు. ఈ పరిస్థితి ఎందుకొచ్చింది?

గత మూడునెలల్లో 15 నౌకలు ఎర్ర సముద్రంలో దాడులకు గురయ్యాయి. ముఖ్యంగా బాబ్ ఎల్ మండెబ్ మార్గంలో రవాణా ప్రమాదంలో పడింది. దీంతో ఎర్రసముద్రాన్ని వదిలి, గతంలో మాదిరిగా గుడ్‌హౌప్ అగ్రాన్ని చుట్టి నౌకలు రాకపోకలు సాగించే విషయం ఆలోచిస్తున్నాయి. కంపెనీలు ప్రతీ కంటైనర్‌మీద ఏడువందల డాలర్ల సర్‌చార్జి విధిస్తూండటం, బీమా కంపెనీలు రేట్లు పెంచడం వంటివి కూడా తోడైనందున ఇది ధరల పెరుగుదలకు మరింత ఆజ్యం పోసే ప్రమాదముంది. హౌతీ తిరుగుబాటు దారుల చర్యను ఆసరా చేసుకుని ఈ సముద్రంపై తన ఆధిపత్యాన్ని పెంచుకోవడానికి అమెరికా ఒక కొత్త కూటమిని తెరపైకి తెచ్చింది. దీనిలో భాగమే పది దేశాలతో మేరిటైమ్ కొయిలేషన్ ఏర్పాటు. ఆయా దేశాల యుద్ధనౌకలతో గస్తీ తిరుగుతూ సరుకు రవాణాకు రక్షణ కల్పిస్తామని అమెరికా చెబుతోంది. ఏతావాతా అమెరికా, ఆయా దేశాలు యుద్ధనౌకలను రక్షణకవచాలుగా పంపినా, భారతదేశం గస్తీపెంచినా దాడులను పూర్తిగా నిరోధించడం, ఈ మార్గాన్ని గత సురక్షిత స్థాయికి తేవడం అంత తేలికైన విషయమేమీ కాదు. హౌతీని బూచిగా చూపి ఈ ప్రాంతంపై తమ గుత్తాధిపత్యాన్ని చలాయించడం కోసం అమెరికా, దాని మిత్ర పక్షాలు ప్రయత్నిస్తున్నాయి. అమెరికా, ఇజ్రాయిల్ దుష్ట కూటమిలో భారత్ కూడా చేరడం మన దేశ ప్రయోజనాలకే పూర్తి విరుద్ధం. ఈ దుష్ట కూటమి నుంచి భారత్ వెంటనే వెనక్కి రావాలి. ఆ దిశగా మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి.

# వికసిత్ భారత్ సంకల్ప యాత్ర విజయవంతం



**చింతూరు, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

చింతూరు మండలంలో చేపట్టిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర విజయవంతంగా ముగిసింది. శనివారం తుమ్మల,లచ్చిగూడెం గ్రామపంచాయితీలలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా చింతూరు మండల బిజెపి అధ్యక్షుడు రమణారెడ్డి(చిట్టిబాబు) మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ గ్రామాల అభ్యున్నతికి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు విపులంగా వివరించడం జరిగింది. ప్రతి ఒక్క సంక్షేమ, అభివృద్ధి పథకాలను వికసిత్ భారత్ సంకల్పయాత్ర ద్వారా ప్రజలకు తెలియజేయడం జరిగిందని చిట్టిబాబు అన్నారు. చింతూరు మండలానికి పిఎం కిసాన్ నిధి నుండి 2800 మంది రైతులకు ఇప్పటివరకు సుమారుగా 50 కోట్ల నాలుగు లక్షల రూపాయలను ఇవ్వడం జరిగిందని అన్నారు. ఉజ్వల గ్యాస్ పంపిణీ పథకం ద్వారా మహిళలకు గ్యాస్,స్టవ్ లను అందించడం జరిగింది అని తెలిపారు. ప్రతి గిరిజనుడికి ఇల్లు కట్టుకోవడానికి 2,30,000 రూపాయలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో నరేంద్ర మోడీ చేపట్టిన సంక్షేమ,అభివృద్ధి పథకాల వలన రానున్న ఎన్నికల్లో గ్రామాల్లో బిజెపి జెండా రెపరెపలాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ పురం మండల బిజెపి అధ్యక్షులు ముత్యాల.రాంబాబు,ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్,ఓబీసీ జిల్లా జనరల్ సెక్రెటరీ పంబి.భూపేష్,జిల్లా శాఖ కిసాన్ మోర్చ నాయకులు సోడి.రమేష్,నోముల సత్యనారాయణ పాల్గొన్నారు.

# మారువేషంలో రంగంలోకి ఎస్సై అనూషా



**దయగిరి/సీతారాంపురం, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

సీతారాంపురం మండల ఎస్సై అనూష మారువేషంలో అక్రమ మద్యం దుకాణాలపై దాడులు నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ లో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఏడుకొండలు అనే వ్యక్తిని ఎస్ఐ అనూష మారువేషంలో వెళ్లి పట్టుకున్నారు. అతని వద్ద నుండి 16 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ మద్యం బాటిళ్లను శవాల ఫ్రీజర్ బాక్స్ లో దాచి ఉంచినట్టు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ముఖ్యంగా మహిళలు ఎస్సై అనూష ను అభినందించారు.

# సిఎస్ పురంలో ఆడుదాం ఆంధ్ర

**యువతకు మంచి అవకాశం : సింగంపల్లి**



**కనిగిరి, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీ కార్యక్రమం యువతకు మంచి అవకాశం అని చంద్రశేఖరాపురం పంచాయతీ సెక్రటరీ సింగంపల్లి రాంప్రసాద్ అన్నారు చంద్రశేఖరపురం మండల కేంద్రంలోని హైస్కూల్లో కోకో కబాడీ గేమ్లను ఆడించారు పంచాయతీ సెక్రెటరీ సింగంపల్లి రాంప్రసాద్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమానికి క్రీడాకారులు పాల్గొన్నారు యువత ఆటలతో ముందుకు సాగుతూ రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చే విధంగా యువకులందరూ కృషి చేయాలని వైసిపి నాయకులు ఆకాంక్షించారు పంచాయతీ సెక్రటరీ సింగంపల్లి రాంప్రసాద్, సర్పంచ్ శ్రీరామ పద్మావతి, మండల ప్రత్యేక అధికారి విద్యాసాగర్ రావు, ఎంపీడీవో పూర్ణచంద్రరావు, ఎంఈఓ ప్రసాద్, వైసీపీ మండల కన్వీనర్ బోయల తిరుపతిరెడ్డి, భువనగిరి వెంకటయ్య, వైసీపీ నాయకులు జై రెడ్డి యూత్ అధ్యక్షులు రమణయ్య, ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య సచివాలయ కన్వీనర్ పాలకొల్లు వెంకటేశ్వర్లు రెడ్డి, సచివాలయం పీఈటీలు నాగేశ్వరరావు, రఫియా, రమేష్ బాబు, సచివాలయ సిబ్బంది మరియు వాలంటరీలు పాల్గొన్నారు.

# సమాజం మెచ్చే విధంగా బాలబాలికలు ఎదగాలి

- ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు (ఐవి)
- భీమవరంలో ప్రారంభమైన బాలోత్సవం



**భీమవరం, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని భవిష్యత్తు,దేశ భవిష్యత్తును నిర్ణయించేది వారే అని అటువంటి బాలలు సాహిత్యం, కళలు ,చరిత్ర తెలుసుకునే విధంగా అవగాహన, ఆసక్తి, ఆలోచన , నైపుణ్యం సృజనాత్మకతను కలిగించే విధంగా బాలోత్సవం నిర్వహించడం అభినందనీయమని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు( ఐవి)అన్నారు. భీమవరంలో చింతలపాటి బాపిరాజు స్మారకోన్నత పాఠశాలలో శనివారం ప్రారంభమైన బాలోత్సవం ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాల బాలికలు మంచి ఆలోచనలు కలిగే విధంగా దేశం మంచి కోరే ఆదర్శ,అభ్యుదయ వాదులుగా ప్రభావం కలిగించినట్లయితే బాలోత్సవాలు సఫలీకృతం అయినట్లేనన్నారు తల్లిదండ్రులు, సమాజం మేచ్చే విధంగా బాలబాలికలు ఎదగాలన్నారు అయితే నేడు మహాకవి గురజాడ చెప్పిన గేయంలో దేశభక్తి ఉందని ప్రజల్లో ఉన్నారని అయితే నేడు పాలకులు దేశభక్తి అనేదానికి అర్ధాలు మార్చివేస్తున్నారన్నారు. దేశభక్తి అంటే దోపిడీ కులమతాల కొట్లాటలు అయిపోయిందన్నారు. పిల్లలకుశుభాకాంక్షలు తెలియజేస్తూ ..ఆటాడుకుందామా.. పాట పాడుకుందామా.. అందరూ కూర్చుని మాట్లాడుకుందామా నోరుండీ పాడలేమా... కాలూండి ఆడలేమా... బొమ్మల్లగా బోసిపోయి బతుకుదామా.. పిల్లల్లోఉత్సాహాన్ని నింపారు.

# విష్ణు ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ "వేలియంట్ - 2కె23" ముగింపు వేడుకలు

- కళాశాలలో ప్రతి సంవత్సరం ఈ టెక్ ఫెస్ట్ (వేలియంట్) నిర్వహిస్తాం
- కళాశాల డైరెక్టర్ మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ దశిక సూర్యనారాయణ



**భీమవరం, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**


డాక్టర్ బి వి రాజు ఫౌండేషన్ మరియు శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వారి విష్ణు ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ నందు రెండు రోజుల నిర్వహించిన 10వ వేలియంట్ - 2కె 23 శనివారంతో ముగిసిందని కళాశాల డైరెక్టర్ మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ దశిక సూర్య నారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ దశిక సూర్యనారాయణ మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రతి సంవత్సరం ఈ టెక్ ఫెస్ట్ (వేలియంట్) నిర్వహిస్తామని దేశంలో వివిధ ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐ.ఐ.టీ, ఎన్.ఐ.టి., ఐ.ఐ.ఐ.టీ, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ యూనివర్సిటీలు, మరియు వివిధ ప్రముఖ కళాశాలల నుండి విద్యార్థులు పాల్గొని వారి సాంకేతిక ప్రజ్ఞా పాటవాలను ప్రాజెక్ట్స్ ద్వారా ప్రదర్శించారని తెలియజేశారు. ఈ టెక్ ఫెస్ట్ లో "డ్రోన్ వోయజ్", "రోబో సాకర్", "ప్రాజెక్ట్ ఎక్స్పో" , "ల్యాబ్ వ్యూ విజ్", "ఫాక్స్ హంట్", "సర్క్యూట్ డీబగ్గింగ్ అండ్ బ్లాక్ బాక్స్", "టచ్-ట్రెండ్స్", "క్రాక్ అల్గోరిథమ్స్", "పోస్టర్ ప్రెసెంటేషన్" , "డేటా డైనమో-డాటాతోన్", "డీబగ్ డెర్బీ", "క్లూ చసేర్సల్", "హాసికతోన్", "కోడ్ హార్మొనీ", "ఐ ఓ టి ప్రోటోతోన్", "బైట్ బస్టర్స్ క్విజ్", "వెబ్దేవ్ మాస్టరీ", "జెనెరేటివ్ ఏ. ఐ", "బ్రాండ్ యూర్సెల్ఫ్", "జంబుల్ కోడ్" , "టెక్ లీడ్", "ఐడీతోన్", "మాట్రిక్స్","రిస్టోర్", "ఫిక్సుకేర్", "టెక్-మోడీ", "క్విజ్జ్", "డుంజెన్స్ అండ్ డ్రాగన్స్", "జి ఈ ఓ -వాల్", "అన్వేషణ", "సి ఏ డి-మేనియా", "సేతు నిర్మాణ్", "ఆర్చ్ మని", "ప్రాజెక్ట్ ఎక్స్పో", "సోలుషన్స్ ఫర్ గ్లోబల్ ఎన్విరాన్మెంటల్ చల్లెన్జ్స్", "గ్రూప్ డిస్కషన్", "సీఎంసీ ఎక్స్పో", "పి పి టి న సీఎంసీ అండ్ టెక్నాలజీ", "మాథెమాటిక్స్ త్రు ఇంజనీర్స్ అయిస్", "నవరస నటన సార్వాభౌమ్మ", "ప్రశ్న చ ఉత్తర చ", "ఏ-బైసికల్ డిజైన్ కాంపిటీషన్", "ప్రాజెక్ట్ ఎక్స్పో" , "మెటాల్లోగ్రఫీ", "ఆటోమొబైల్ డిజైనతోం", "బ్రహ్మ", "విష్ణు రోబో రేస్", "మెచ్చుని", "టేకింగ్ టైటాన్స్", "స్లో బైక్ రేస్", "కల్చరల్ ఈవెంట్స్", "గేమ్స్ మరియు స్పోర్ట్స్" మొదలగు వివిధ రకాల ఈవెంట్స్ మరియు పోటీలలో విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలియజేశారు. విద్యార్థులు పుస్తకాలకు మాత్రమే పరిమితంకాకుండా నూతన సాంకేతిక ఆవిష్కరణల దిశగా పయనించాలని మరియు విజ్ఞాన వినిమయానికి తోడ్పడాలన్నది తమ టెక్ ఫెస్ట్ ముఖ్య ఉదేశ్య మని అన్నారు.ఈ కార్యక్రమంలో వేలియంట్ - 2కె 23 కన్వీనర్ ఆర్ శ్రీనివాస రాజు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుండి కూడా విద్యార్థినీ, విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్సహంగా పాల్గొని ఈ టెక్ ఫెస్ట్ను విజయవంతం చేశారని పేర్కొంటూ, తమను ప్రోత్సాహించిన విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్. కె వి విష్ణురాజు కి, వైస్ చైర్మన్ శ్రీ.రవిచంద్రన్ రాజగోపాల్ గారికి, కార్యదర్శి ఆదిత్య విస్సం గారికి, కళాశాల డైరెక్టర్ మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ దశిక సూర్యనారాయణ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ టెక్ ఫెస్ట్ నందు వివిధ రంగాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ టెక్ ఫెస్ట్ లో విద్యార్థులు సాంకేతిక ప్రతిభతో పాటు ఫ్లాష్ మాబ్ వంటి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ద్వారా ఆహుతులను అలరించారు. ఈ వేలియంట్ -2కె 23 మహోత్స వానికి, కన్వీనర్ ఆర్ శ్రీనివాస రాజు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెషర్ కె. శ్రీనివాస్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# మండల స్థాయి "ఆడుదాం ఆంధ్ర" కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్‌రెడ్డి

**భీమవరం, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

జనవరి 10 వ తేదీ నుండి జరిగే మండల స్థాయి "ఆడుదాం ఆంధ్ర" కార్యక్రమాన్ని ఇదే స్ఫూర్తితో విజయవంతం చెయ్యాలని సంబంధిత అధికారులకు జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి ఆదేశించారు. శనివారం జిల్లా జాయింటు కలెక్టరు ఛాంబర్ నందు జనవరి 10 వ తేదీ నుండి జరిగే మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై జిల్లా, నియోజకవర్గాల స్థాయి అధికారులతో జిల్లా జాయింటు కలెక్టరు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి శుక్రవారం భీమవరం పర్యటన లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో ఆడుదాం ఆంధ్ర రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రస్తావించి, కాసేపు ముచ్చటించారని ఇది సమిష్టి కృషి అని ఆయన అన్నారు. ఇదే స్ఫూర్తితో జనవరి 10 వ తేదీ నుండి 23 వ తేదీ వరకు జరిగే మండల స్థాయి ఆడదాం ఆంధ్ర, ఆ తర్వాత జరిగే క్రీడల్లో కూడా విజవంతంగా నిర్వహించుకుని రాష్ట్రంలోనే మన పశ్చిమగోదావరి జిల్లా మొదటిస్థానం నిలేచెలా కృషి చెయ్యాలన్నారు. ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడా కారులందరూ పాల్గొనేలా చూసి, పెద్ద ఎత్తున ప్రజలు, క్రీడా అభిమానులు పాల్గొనేలా చూడాలన్నారు. ఇప్పటివరకు జరుగుతున్న క్రీడా కార్యక్రమాలను తెలుసుకుని, అధికారులకు జిల్లా జాయింటు కలెక్టరు దిశా నిర్ధేశం చేసారు. ప్రతి ఒక్కరినీ క్రీడలలో భాగస్వామ్యం చేయడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం, ఆనందాన్ని సొంతం చేసుకోవడం సాధ్యం అన్నారు. గ్రామీణ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వం వివిధ దశల్లో క్రీడా పోటీలను నిర్వహించుటలో అధికారులు చురుకైన పాత్ర పోషించాలన్నారు. త్రాగునీరు, మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బృందాలు, తగినన్ని క్రీడా సామాగ్రి, తదితరు మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సర్పంచులు, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని విజయవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. క్రీడాకారులు గ్రౌండు దగ్గరలో నివాసంగా ఉండాలని, అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. జరిగే క్రీడా పోటీలను సోషల్ మీడియా, లోకల్ ఛానెల్స్, ప్రెస్ ద్వారా విస్తృత ప్రచారం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమాలు ముందుగానే అందరికీ తెలిసేలా సచివాలయంలో డిస్ప్లే చెయ్యాలన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు నియోజకవర్గాల స్థాయిలోను, నియోజకవర్గాల వారీగా ఎంపికైన విజేతలకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సంబంధిత అధికారులు పూర్తి సమాచారం ఉన్న డైరీ ని దగ్గర ఉంచుకుని, క్రీడల ఏర్పాట్లపై నిమగ్నమై ప్రతి రోజు జరిగే క్రీడలు విజయవంతం చెయ్యాలని అధికారులకు జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ ఇంచార్జి, డియల్డిఓ ఏవి అప్పారావు, గేమ్స్ ఫెడరేషన్ కోచ్ మల్లేశ్వరరావు, చీఫ్ కోచ్ డా.యం దుర్గారావు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేదల నెత్తిన అధిక ధరల భారం మోపిన ఘనుడు జగన్

- నవరత్నాలు మేనిఫెస్టో అమలు అంతా బూటకం
- జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర హామీల అమలులో 85% ఫెయిల్
- టీడీపీ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం



**రామచంద్రపురం, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో పాదయాత్రలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రాష్ట్రంలో నిరుపేదల నెత్తిన అధిక దరలు మోపిన ఘనుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం ఎద్దేవా చేసారు.ఈమేరకు రామచంద్రపురం పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మేనిఫెస్టోలో చెప్పిన దానికన్నా అదనంగా ఎంతో చేసామని అన్నారు. నేడు అన్ని వర్గాల ప్రజలు చంద్రబాబు నాయుడుకి బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు జగన్మోహన్ రెడ్డి గొంతు కోశాడనో 2లక్షల 30 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తానని మాట తప్పాడనో అన్నారు. అంగన్వాడీలకు తెలంగాణ రాష్ట్రం కన్నా వెయ్యి రూపాయల అదనంగా పెంచుతామన్న హామీపై మడమతిప్పి అంగన్వాడీలను రోడ్డు పైకి నెట్టారని మధ్య నిషేధం చేసి ఓటు అడుగుతానన్న హామీకి విరుద్ధంగా మద్యం ఆదాయం 15 ఏళ్ల బ్యాంకులకు తాకట్టు పెట్టారని విమర్శించారు.అలాగే విద్యుత్ చార్జీలు పెంచను అన్న హామీకి విరుద్ధంగా 64 వేల కోట్ల విద్యుత్ భారాన్ని రాష్ట్ర ప్రజలు పై మోపిన ఘనుడు జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. సిపిఎస్ రద్దు, రైతు రుణమాఫీ, మద్య నిషేధం, అమరావతి అభివృద్ధి, ఇసుక అక్రమ తరలింపు నివారణ వంటి అనేక హామీలపై మాట తప్పి మడమతిప్పరని తెలిపారు. 99.5% హామీలు అమలు చేశానని అబద్ధాలు చెప్పుకోవడం సిగ్గు సేటని ఎద్దేవా చేశారు. టిడిపి ప్రభుత్వంలో ప్రతి పేద కుటుంబానికి ఆసరాగా నిలబడి వారి జీవనోపాధికి తోడ్పాటును ఇచ్చిందని గుర్తుచేసారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పేదల నడ్డి విరుస్తూ అధిక భారాలు మోపుతూ వారి ఆత్మహత్యలకు కారణం అవుతున్నాడని విమర్శించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు జగన్మోహన్ రెడ్డి 25 హామీలు ఇచ్చి 25కి 25 హామీలు అమలు చేయకుండా పూర్తిగా విఫలమయ్యారని,కొబ్బరి , తమలపాకు రైతులను ఆదుకుంటానని హామీ ఇచ్చి కోనసీమ ప్రాంత ప్రజలను మోసం చేశారన్నారు.ఇది నిరూపించడానికి నేను సిద్ధమని ప్రభుత్వం తరపున ఉమ్మడి జిల్లా మంత్రులు సిద్ధమా అంటూ సుబ్రహ్మణ్యం ఈసందర్భంగా అని సవాల్ చేశారు.

# కనీస వేతనం కోసం కధం తొక్కిన అంగన్‌వాడీలు

- రామచంద్రపురంలో 19వ రోజు కొనసాగిన సమ్మె
- మంత్రి వేణుగోపాల్ ఇల్లు ముట్టడి

**రామచంద్రపురం, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**



సిఐటియు ఆధ్వర్యంలో కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె 19వరోజు కార్యక్రమంలో బాగంగా స్థానిక ఎమ్మెల్యే ,మంత్రి వేణుగోపాల్ కృష్ణ ఇంటిని ముట్టడించారు. ఈమేరకు శనివారం రామచంద్రపురం, కె.గంగవరం, మండపేట, ఆలమూరు, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల అంగనవాడీలు ఈ ధర్నా లో సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరామ్, అంగనవాడి జిల్లా కార్యదర్శి, అధ్యక్షలు దుర్గమ్మ, వీరలక్ష్మి, బేబీ, రాణి,ఆదిలక్ష్మి,సుశీల అద్వర్యంలో జరిగింది దీంతో మంత్రి వేణుగోపాల్ కృష్ణ ఇంటిదగ్గర లేకపోవడంతో 3 గంటల వరకు తమ డిమాండ్ లతో నినాదాలు చేసి మంత్రి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ర్యాలీగా పసలపూడి వై జంక్షన్ దగ్గరికి వెళ్లి మానవహారం చేసి నినాదాలు ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం అంగనవాడి ల సమస్యలను తీర్చామని, అసత్య ప్రచారాలు చేస్తుందని ప్రభుత్వ ఇప్పటికైనా తన మొండి వైఖరి వీడి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని అన్నారు. అంగనవాడిలు అడుగు వెనక్కి వేయరని తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేస్తూనే ఉంటారని నాయకుల అన్నారు.

# సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తాం

**వీరవాసరం, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**



సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని అంగన్వాడీలు నినదించారు. శనివారం అంగన్వాడీల సమ్మె 19వ రోజుకు చేరి న నేపథ్యంలో వీరవాసరంలో అంగన్వాడీల ఆం దోళన తీవ్రతరం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె శిబిరాల్లోనే ఉండి నిరసన కొన సాగిస్తామని అవసరమైతే కుటుంబాలతో సైతం సమ్మె శిబిరాల్లోనే ఉంటామని నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం ఆంజనేయులు మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమమే మనకు ఆదర్శం కావాలని, బెంగళూరు, హర్యానా రాష్ట్రాలలో అంగన్వాడీల సమ్మె చారిత్రాత్మకంగా జరిగిందని ఆ పోరాటాలను ఆదర్శంగా తీసుకుని మన సమ్మె విజయవంతం చేయాలని అన్నారు. ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తూ అంగన్వాడీలను మోసగిస్తుందని, మొండి వైఖరి, నిర్బంధం మాత్రమే ప్రభుత్వానికి తెలుసని సమస్యలు పరిష్కరించడం చేతకాదని ఆయన అన్నారు. అక్క చెల్లెమ్మలని పిలిచే ముఖ్యమంత్రి గారికి అక్క చెల్లెమ్మల సమస్య పట్టకపోవడం విచిత్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, వై వెంకటలక్ష్మి, సత్యవతి, శాంతి కుమారి, అన్నపూర్ణ, నాగ పార్వతి తదితరులు నాయకత్వం వహించారు.

# శ్రీకృష్ణదేవరాయ తెలగ కాపు బలిజ సంఘం వారి వార్షిక లక్ష తులసి పూజ

**వీరవాసరం, డిసెంబర్ 30 (శ్రీచక్ర) :**



శ్రీకృష్ణదేవరాయ తెలగ కాపు బలిజ సంఘం వారి వార్షిక లక్ష తులసి పత్రి పూజ రాయకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానము నందు శనివారం మూలమూర్తులకు విశేషంగా అభిషేకములు జరిగినవి. అనంతరం లక్ష తులసి పూజ ఘనంగా జరిగినది. దేవేరులను విశేష పుష్పములతో అలంకరించినారు. అనంతరం సాయంత్రం శాంతి కళ్యాణం జరిగినది. విశేషంగా భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు నారాయణ శ్రీనివాస దీక్షితులు పర్యవేక్షణలో 15 మంది పండితులచే పూజా కార్యక్రమంలో ఘనంగా జరిగినవి.ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ తెల్లగా కాపు సంఘం ప్రతినిధులు కాయల నానిబాబు, కొప్పినీడి గోపాలకృష్ణ,పోలిశెట్టి ప్రసాద్, అడ్డాల బాబి,దేవిరెడ్డి వెంకటేశ్వరరావు,పోలిశెట్టి శివ నారాయణ,ముచ్చర్ల సాయి, కొప్పుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



# బాలీవుడ్‌లో రీ ఏంట్రీ..!

ఈ ఏడాది పొన్నియన్ సెల్వం 2 తో మంచి విజయం అందుకున్న త్రిష ఆ తరువాత వచ్చిన లియో మూవీ తో బిగ్గెస్ట్ హిట్ అందుకున్నది. ఈ మూవీస్ తో కోలీవుడ్ లోకి అదిరిపోయే కమ్‌బ్యాక్ ఇచ్చిన త్రిష తాజాగా బాలీవుడ్ లోకి రీఎంట్రీ ఇవ్వబోతున్నది.పదమూడేళ్ల లాంగ్ గ్యాప్ తర్వాత హిందీ లో ఓ బిగ్ హీరో సరసన నటించేందుకు త్రిష గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఆ బిగ్ హీరో ఎవరో కాదు బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్..పవన్ కళ్యాణ్ తో పంజా సినిమా తెరకెక్కించిన విష్ణువర్ధన్ దర్శకత్వం లో సల్మాన్ ఖాన్ హీరోగా 'ది బుల్' పేరుతో ఓ మూవీ తెరకెక్కుతోంది. యాక్షన్ ఎంటర్‌టైనర్ గా రూపొందుతోన్న ఈ మూవీలో త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది.సౌత్‌లో స్టార్ హీరోయిన్ గా వున్న త్రిష బాలీవుడ్ లో ఇప్పటివరకు ఒకే ఒక సినిమా చేసింది. 2010లో అక్షయ్ కుమార్ హీరోగా నటించిన 'కట్టా మీటా' సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది త్రిష. కట్టా మీటా తర్వాత హిందీలో అవకాశాలు వచ్చినా కూడా త్రిష సౌత్ లో బిజీ గా ఉండటం తో ఆ ఆఫర్స్‌ను తిరస్కరించింది. ది బుల్ మూవీకి కరణ్ జోహార్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.. దాదాపు 25 ఏళ్ల అనంతరం సల్మాన్ ఖాన్, కరణ్ జోహార్ కాంబినేషన్ లో సినిమా వస్తుండటం తో సినిమా పై బాలీవుడ్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది..అయితే త్రిష ప్రస్తుతం కోలీవుడ్ లో ఎంతో బిజీ హీరోయిన్ గా మారారు. ఈ భామబాలీవుడ్ తో పాటు టాలీవుడ్ లో కూడా ఓ బిగ్ మూవీ లో ఛాన్స్ కొట్టేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఆ బిగ్ మూవీ ఏదంటే మెగాస్టార్చిరంజీవి, బింబిసార ఫేమ్ వశిష్ఠ కాంబినేషన్ లో వస్తున్న 'మెగా 156' సినిమా లో త్రిషహీరోయిన్ గా ఎంపికైనట్లు వార్తలు వస్తున్నాయి..



# కుర్చీ మడత పెట్టి చాలా దూరం వెళ్తోంది



గుంటూరు కారంలో మహేష్ ఊర మాస్ చూడొచ్చని పోస్టర్లలో చూపించడం తప్పించి నిజంగా ఏ స్థాయిలో ఉంటుందనేది ఇవాళ వదిలిన చిన్న పాట టీజర్ తో అభిమానులకు క్లారిటీ వచ్చేసింది. ఒక మీమ్ పేజీలో ముసలాయన చెప్పిన వైరల్ మాటను తీసుకుని ఏకంగా సాంగ్ రాయించి ట్యూన్ కట్టించడం సోషల్ మీడియా జనాలను ఆశ్చర్యపరిచింది. గతంలో ప్రభుత్వాల గురించి మాట్లాడుతూ ఆ వృద్ధుడు అన్న కామెంట్ కొన్ని నెలల క్రితం చాలా వైరలయ్యింది. ఎంతగా అంటే కొన్ని యూట్యూబ్ ఛానల్స్ ఏకంగా ఆయన్ని ఇంటర్వ్యూ చేసేంత, వాటికి లక్షల్లో వ్యూస్ వచ్చేంత. ఇక టాపిక్ లోకి వద్దాం.కుర్చీ మడత బెట్టి ప్రోమో కేవలం కొన్ని సెకండ్లే అయినా ఇప్పుడిది చాలా దూరం వెళ్తోంది. మహేష్ శ్రీలీల డాన్సులకు ఫ్యాన్స్ హుషారెత్తి శివాలెత్తి పోతుండగా మరికొందరేమో స్టెప్పులు ఒకే కానీ లిరిక్స్, ట్యూన్ మీద కంప్లయింట్ వ్యక్తం చేస్తున్నారు. ఒక ప్రముఖ న్యూస్ ఛానల్ కు చెందిన యాంకర్ ఏకంగా ఒక వీడియో చేసి మహేష్, తమన్, త్రివిక్రమ్ రేంజ్ వ్యక్తులు తీసుకోవాల్సిన పాట ఇది కాదని చెబుతూ, కుర్చీ మడత పెట్టి తర్వాత ఏంటి డాడీ అని తన కొడుకు అడిగితే చెప్పలేకపోతున్నానని అనడం ట్విట్టర్లో తిరుగుతోంది. దీని మీద సైతం మిశ్రమ స్పందన రావడం గమనార్హం. ఈ పాజిటివ్ నెగటివ్ లు కాసేపు పక్కనపెడితే మొత్తానికి మహేష్ లోని రియల్ మాస్ ని త్రివిక్రమ్ బయటికి తీస్తున్నట్టే కనిపిస్తోంది. పోకిరి, ఒక్కడు తర్వాత మళ్ళీ ఆ రేంజ్ కమర్షియల్ సినిమా తమ హీరో చేయలేదని అసంతృప్తితో ఉన్న వాళ్లకు పూర్తి ఆకలి తీర్చేలా ఉందని బోలెడు అంచనాలు పెంచేసుకుంటున్నారు. పోటీలో ఎన్ని ఉన్నా మహేష్ కమర్షియల్ స్టామినాని సరిగ్గా వాడుకుని పబ్లిసిటీ చేస్తే హైప్ ఏ రేంజ్ లో వస్తుందో గుంటూరు కారం మరో ఉదాహరణగా నిలుస్తోంది. జనవరి మొదటి వారం చివర్లో ప్రీ రిలీజ్ ఈవెంట్ తో పాటు ట్రైలర్ లాంచ్ చేసేలా సితార టీమ్ ప్లానింగ్ చేస్తోంది.

# ఉగాది నాటికి నంది అవార్డులు

నంది అవార్డులపై రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త సంవత్సరంలో నంది అవార్డులు అందివ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. చిత్ర పరిశ్రమను సత్కరిస్తే తమ ప్రభుత్వానికి పేరు వస్తుందన్నారు. ఉగాది నాటికి నంది అవార్డులను ఇచ్చేలా పరిశీలిస్తామన్నారు. పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా నంది అవార్డులను ఇస్తామన్నారు. ముఖ్యమంత్రితో చర్చించిన అనంతరం సినీ పెద్దలను ఆహ్వానించనున్నట్లు ఆయన తెలిపారు. తెలుగు చిత్రపరిశ్రమకు చెందిన సీనియర్ నటుడు మురళీ మోహన్ 50 ఏళ్ల సినీ ప్రస్థానం వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నటసింహ చక్రవర్తి బిరుదుతో మురళీమోహన్‌ను సత్కరించారు. అనంతరం మురళీ మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత నంది అవార్డులు ప్రశ్నార్థకమయ్యాయన్నారు. జగన్ ప్రభుత్వం నంది అవార్డులు ఇవ్వలేదని, కెసిఆర్ సింహా అవార్డుల పేరు ఇస్తామని చెప్పినా ఇవ్వలేకపోయారన్నారు. సినిమా, టివి, నాటకరంగాలకు అవార్డులు ఇస్తే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ హయాంలోనైనా నంది అవార్డులు ఇస్తారని ఆశిస్తున్నామన్నారు. రేవంత్‌రెడ్డిని కలిసి అవార్డులపై విన్నవిస్తామన్నారు. 2024లో నంది అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే సత్కారం కోసం వేచిచూస్తామన్నారు. సినీ పరిశ్రమను గౌరవించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.



# నాగార్జున అడుగు ముందుకా వెనక్కా

నా సామిరంగ విడుదల తేదీ జనవరి 14 కన్ఫర్మని నిన్నటి దాకా ఉన్న పక్కా సమాచారం. అక్కినేని వర్గాలతో పాటు ప్రొడక్షన్ హౌస్ నుంచి ఇదే మాట చెబుతూ వచ్చారు.షూటింగ్ నిర్విరామంగా జరుగుతూనే ఉంది. ఈ కారణంగానే రావాలని ఉన్నా కూడా వెంకటేష్ 75 ఈవెంట్ కి నాగ్ హాజరు కాలేదు. ఎట్టి పరిస్థితుల్లో సంక్రాంతికి రావాల్సిందేననే పట్టుదలతో హీరోతో పాటు దర్శకుడిగా మొదటి సారి మెగా ఫోన్ చేపట్టిన విజయ్ బిన్నీ చాలా కష్టపడుతున్నాడు. టీజర్ చూశాక అభిమానుల్లో నమ్మకం వచ్చేసింది. పాటలు మెల్లగా ఎక్కుతున్నాయి. కానీ ఇరవై నాలుగు గంటల టైంలో తెరవెనుక కొత్త కథలు జరిగిపోతున్నాయి. ఎలాగైనా సరే నా సామిరంగను వాయిదా వేసేలా ఒప్పిస్తున్నారనే వార్త ఉదయం నుంచి చక్కర్లు కొడుతోంది. మంచి కంటెంట్ చేతిలో ఉన్నప్పుడు తక్కువ థియేటర్లతో ఎందుకు రాజీ పడతారనే పాయింట్ మీద నాగార్జునతో పలువురు పెద్దలు చర్చిస్తున్నారట. ఒకవేళ నిజంగా హిట్ అయినా సరే అగ్రిమెంట్ల వల్ల గుంటూరు కారం, హనుమాన్, ఈగల్, సైంధవ్ లతో స్క్రీన్లు పంచుకునే కారణంగా ఆశించిన రెవిన్యూ రాదనే కోణంలో డిస్కషన్లు చేస్తున్నారట. అయితే మిగిలినవాటికి ఈ రిస్క్ ఉన్నప్పటికీ థియేటర్, ఓటిటి డీల్స్ ని పక్కాగా పూర్తి చేసుకోవడంతో ఇబ్బంది లేదని అంటున్నారు. నాగ్ మూవీకి మరో చిక్కు ఉంది. ఇప్పటిదాకా అఫీషియల్ గా రిలీజ్ డేట్ ప్రకటించని సినిమాల్లో నా సామిరంగనే ఆఖరుది. ప్రతి పోస్టర్ లో పండగని హైలైట్ చేయడం తప్పించి తేదీని ఎక్కడా పేర్కొనలేదు. అలాంటప్పుడు రాజీ పడితే తప్పేమి లేదని అడుగుతున్నారట.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**